కల్వర్టు నిర్మాణం కోసం రోడ్డుపై బైటాయించిన రెండు గ్రామాల ప్రజలు



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల కేంద్రం నుంచి నాగపురి మీదుగా యాదగిరి గుట్టకు వెళ్ళే ప్రధాన రహదారి పైన కడవేరుగు గ్రామ శివారులో కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరుతూ పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట గ్రామాల ప్రజలు మంగళవారం రోడ్డుపైన బైటాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కల్వర్టు లేక గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతం గుండా ప్రయాణం చేసే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత ప్రభుత్వ హయంలో కల్వర్టు నిర్మాణం కోసం శంకుస్థాపన చేసినా అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ప్రభుత్వం స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం తహశీల్దార్ మహమ్మద్ సమీర్ హమ్మద్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
బుధవారం | 04 సెప్టెంబరు 2024 | www.navatelangana.com

భూసేకరణ నిలిపివేయాలని రైతుల రాస్తారోకో

వరుసగా రెండోరోజు రోడ్డెక్కిన అన్నదాత



నవతెలంగాణ-న్యాల్‌కల్

సాగు భూములను ఎట్టి పరిస్థితుల్లో ఫార్మాసిటిలకు ఇచ్చేది లేదని మంగళవాం రోజున వరుసగా రెండోరోజు మల్గి, డప్పూర్, వడ్డీ గ్రామాల రైతులు రోడ్డెక్కారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాల యం ఎదుట న్యాల్‌కల్ నారాయణఖేడ్ వెళ్లే రోడ్డుపై పెద్దసంఖ్యలో బైటాయించారు. బలవంతంగా భూములను తీసుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని భూ నిర్వాసిత నాయకులు శివరాజ్, రవికుమార్, రాజు గౌడ్, మారుతి యాదవ్, ఎల్లారెడ్డి, అరుణ్, పలు వురు భూ బాధితులు హెచ్చరించారు. అనంతరం భూములు మాత్రం ఇవ్వబోమని తహసీల్దార్ భూపాల్, ఉపతహసిల్దార్ రాజిరెడ్డికి రైతులు వినతిపత్రం అందజేశారు. రాకపోకలకు ఇబ్బంది కలగకుండా హద్నూర్ ఎస్సై రామునాయుడు ఘటనా స్థలానికి చేరుకుని రైతులను శాంతింపజేశారు.

వడవని వాన గోస.. అపార నష్టం



- నీట మునిగిన 1500 ఎకరాల పంట పొలాలు
- పొంగిన వాగులు, వంకలు... రోడ్ల ధ్వంసం
- దెబ్బతిన్న 32 ఇళ్లు, 50 విద్యుత్ స్థంబాలు, చెట్లు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- వీధులన్నీ బురదమయం...వడవని వాన

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల గోస వడవట్లేదు. నాలుగు రోజుల పాటుగా కురుస్తున్న వానల వల్ల అపార నష్టమేర్పడింది. ఇంకా వర్షం వీడలేదు. మంగళవారం సైతం ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు చోట్ల వర్షం పడింది. ఎడతెరపి లేకుండా వానలు కురియడంతో పంట పొలాలు నీట మునిగాయి. వరద నీరు చేరి చెర్వులు, జలాశయాలు నిండుకుంటున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. పలు చోట్ల పాత ఇళ్లు, చెట్లు, విద్యుత్ స్థంబాలు కూలిపోయాయి. చేపల వేటకెళ్లి ఒక వ్యక్తి గల్లంతవ్వగా పశువులు మృత్యువాత పడ్డాయి. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ రోడ్లు ధ్వంసమయ్యాయి. పలు చోట్ల లోతట్టుగా ఉన్న రోడ్లుపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు సైతం బంద్ అయ్యాయి. మూడు జిల్లాల్లోనూ కురిసిన వర్షాలు అతలాకుతలం చేశాయి. వర్షాభావం పరిస్థితుల వల్ల ఖరీఫ్ సాగు విస్తీర్ణం తగ్గింది. పైగా పైర్లు చేతికొస్తాయా రావా అన్న పరిస్థితుల్లో ఉన్నట్లుండి భారీ వర్షాలు కురియడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. చెర్వులు, కుంటలు నిండి మత్తడి దునుకున్నాయి. సింగూరు, నల్లవాగు ఇతర ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉమ్మడి మెదక్ జిల్లాలో తీవ్రమైన నష్టం వాటిల్లింది. అత్యధికంగా మెదక్‌లో 1010.3 మిల్లీ మీటర్ల అత్యధిక వర్షాపాతం నమోదైందంటే వర్షం తీవ్రత ఏమిటో అర్ధమవుతుంది. సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురియడంతో అత్యధిక వర్షాపాతం నమోదైంది.

1500 ఎకరాల్లో పంట నష్టం

ఎడతెపరి లేకుండా కురుస్తున్న వర్షం వల్ల ఉమ్మడి మెదక్ జిల్లాలో 1500 ఎకరాల్లో వివిద రకాల పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరడం, సింగూరు ప్రాజెక్టు ఎడమ కాల్వకు గండిపడడం, పలు చోట్ల రోడ్లు కోతకు గురవ్వడంతో పంట పొలాలన్నీ నీట మునిగాయి. సంగారెడ్డి జిల్లాలో 750 ఎకరాల్లో సోయా, మినుము, పెసర, కంది, కూరగాయలు, వరి వంటి పంటలు నీట మునిగి దెబ్బతిన్నాయి. మెదక్ జిల్లాలో సైతం 250 ఎకరాల్లో వివిద పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. సిద్దిపేట జిల్లాలో సైతం వరదనీరు చేరడంతో పత్తి, వరి, ఇతర మెట్ట పంటలు 500 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. నీట మునిగి దెబ్బతినడమే కాకుండా పొలాల్లో నీరు నిల్వ ఉండడంతో విపరీతమైన తెగుళ్ల ఆశించి పత్తి, కూరగాయలు, వరి, కంది వంటి పంటలు మరింత దెబ్బతినే అవకాశముంది. వర్షాలకు పంటలు దెబ్బతినకుండా పలు జాగ్రతలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తున్నారు. ముఖ్యంగా అధిక వర్షాల వల్ల పండ్ల తోటలకు నష్టం వాటిళ్లనుందని సూచిస్తున్నారు. కొత్తగా నాటిక పండ్ల తోటల్లో మొక్కలు గాలికి వ ంగిపోయి నేలవాలాయి. పెరుగుతున్న తోటల్లో మొక్కల కొమ్మలు విరిగిపోయాయి. పాత మామిడి తోటల్లో చెట్లు, కొమ్మలు బలమైన గాలులకు విరిగిపోయాయి. ఉల్లి, అల్లం, ఆలుగడ్డ వంటి పంటలకు కూడా నష్టం వాటిల్లనుంది. సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నా వర్షం వడవకపోవడంతో వీలుకావట్లేదని రైతులు పేర్కొంటున్నారు.

దెబ్బతిన్న 325 ఇళ్లు..20 స్కూల్ భవనాలు

వర్షాల వల్ల ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు చోట్ల పాత ఇళ్లు కూలిపోయాయి. కొన్ని చోట్ల గోడలు కూలడం, పై కప్పు రేకులు గాలికి లేచిపోవడం, స్కూల్ భవనాల పై కప్పు పెచ్చులూడిపడడం వల్ల 325 ఇళ్లు, 20 స్కూల్ గదుల వరకు వర్షాలకు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఇళ్లు దెబ్బతినడంతో ఇంటి యజమానులు వీధిన పడ్డారు. మెదక్ జిల్లాలో 7 ప్రభుత్వ స్కూల్స్‌లో తరగతి గదులు, వంట గదులు దెబ్బతిన్నట్లు కలెక్టర్ ప్రకటించారు. వాటికి తక్షణమే మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా మూడు జిల్లాల్లో కూలిన ఇళ్లు, దెబ్బతిన్న ఇళ్ల వివరాల్ని సేకరించి నివేదించాలని కూడా కలెక్టర్లు అధికారుల్ని కోరారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని తోటపల్లి ఆన్‌లైన్ రిజర్వాయర్‌లో చేపల వేట కోసం సందిరి లక్ష్మణ్ వెళ్లి వరదలో కొట్టుకుపోయాడు. రెండు రోజుల తర్వాత అతని శవం ఆచూకి లభించింది. పలు చోట్ల ఆవులు, మేకలు సైతం వరదల్లో చిక్కి మృత్యువాత పడ్డాయి. ఉమ్మడి జిల్లాల్లో వర్షాల వల్ల 11 కేవీ విద్యుత్ లైన్లకు సంబంధించిన 50 స్థంభాల వరకు దెబ్బతిన్నాయి.

నిండుకుంటున్న చెర్వులు, జలాశయాలు

చెర్వులు, కుంటలు, జలాశయాల్లో నీళ్లలేక ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాగు తగ్గింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో లక్ష ఎకరాలకు వరకు వివిద పంటల సాగు తగ్గింది. ముఖ్యంగా నీటి ఆధారితంగా సాగు చేసే వరి సాగు బాగా తగ్గింది. వర్షాభావ పరిస్థితులేర్పడడంతో మూడు జిల్లాల్లోని చెర్వులు నిండలేదు. అలాగే సింగూరు, మల్లన్నసాగర్, ఇతర జలాశయాల్లో సైతం నీటి మట్టం బాగా తగ్గిపోయాయి. అయితే ఇటీవల భారీ వర్షాలు కురియడంతో ఎగువ నుంచి భారీ ఎత్తున వరద రావడంతో సింగూరు, నల్లవాగు, మల్లన్న సాగర్ వంటి ప్రాజెక్టుల్లోని నీరు వచ్చి చేరుతుండడంతో నీటి మట్టం పెరుగుతోంది. అదే విధంగా మూడు జిల్లాలో వేల సంఖ్యలో ఉన్న చెర్వులు సైతం నిండుకునే దశకు చేరాయి. ఇప్పటికే 100 శాతం నిండిన చెర్వుల్లో మత్తడి దూకుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో 1769 జన వనరులున్నాయి. వీటిల్లో 50 నుంచి వంద శాతం710 చెర్వులు నిండాయి. మెదక్ జిల్లాలో 831 చెర్వులు 75 శాతం నుంచి వంద శాతం వరకు నిండాయి. సిద్దిపేట జిల్లాల్లోనూ 620 చెర్వుల వరకు 50 శాతానికి పైగా నీటి మట్టానికి చేరుకున్నాయి. సింగూరు ప్రాజెక్టు 523.600 మీటర్లకు గాను ప్రస్తుతం 522.523 మీటర్లకు చేరింది. ప్రాజెక్టు నీటి సామార్థ్యం 29.917 టీఎంసీలు కాగా ప్రస్తుతం 18.905 టీఎంసీలకు చేరింది. నల్లవాగు ప్రాజెక్టుల్లోకి కూడా 350 క్యూసెక్కుల వరద నీరు వచ్చింది. పుల్కల్ మండలంలోని ఇసోజిపేట వద్ద సింగూరు ప్రాజెక్టు ఎడమ కాల్వకు గండిపడింది. దీంతో దిగువన ఉన్న వరి, ఇతర పంట పోలాలన్నీ కొట్టుకుపోయి నీట మునిగాయి.

ఇండ్లు కూలిన బాధితులను ఆదుకోవాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల్లో భారీ వర్షానికి ఇండ్లు కూలిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆర్డీవో అశోక్ చక్రవర్తికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నారాయణఖేడ్ ఏరియా నాయకులు రమేష్ మాట్లాడుతూ.. నారాయణఖేడ్ మండలంలోని సీతారాంనాయక్ తాండాకు చెందిన జాదవ్ నారాయణ, చల్లగిద్ద తాండాకు చెందిన వాడిత్య పండిత్, ర్యాకల్ గ్రామానికి చెందిన హనుమంతు, ఆకుల లింగాపూర్ నీటి వెనక నాగమ్మ, కంగ్టి మండలం చాప్తకే గ్రామంలో నాలుగు ఇండ్లు కూలిపోయాయన్నారు. ఇల్లు కూలిపోయిన వారందరూ వ్యవసాయ కూలీలని.. కాబటి ఆ పేదలను ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు. కొత్త ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆహారం లేక వారు నానా అవస్థలు పడుతున్నారని.. కాబట్టి వారికి ఆహార ధాన్యాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు సతీష్ శ్రీకాంత్ సామాజిక నాయకుడు సర్దార్, బాధితులు ఉన్నారు.

భెల్ ఈడిని కలిసిన ఎస్సీఅసోసియేషన్ సభ్యులు



నవతెలంగాణ-రామచంద్రాపురం

బీహెచ్‌ఈఎల్ ఎస్సీ ఎంప్లాంయస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం మంగళవారం భేల్ పరిశ్రమ ఈడి కేబి రాజా మరియు జీఎమ్ హెచ్‌ఆర్ వి శ్రీనివాస్ రావును మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఈడి కే బి రాజు నూతన అధ్యక్షుడు సురేందర్ ప్రధాన కార్యదర్శి దేవాఅర్జున్‌తోపాటు కార్యవర్గాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అసోసియేషన్ ఐక్యతతో పాటు సంస్థ ఉత్పత్తిలో సైతం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినందుకు హెచ్‌ఆర్ ఐఆర్ ఎన్నికల అధికారిని లావణ్యను అభినందిం చారు. ఈ సందర్భంగా నూతన ఎస్సీ అసోసియేషన్ సభ్యులు భేల్ అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో ఐఆర్ ఏజీఎం అమిత్ కుమార్, ఐఆర్ సీనియర్ డిజిఎం సత్యభావం, లైసెన్ ఆఫీసర్ శంకరయ్య, వెల్ఫేర్ ఆఫీసర్ మాయ బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలి



నవతెలంగాణ-కొండాపూర్

గణేశ్ మండపాలకు పోలీస్ పోర్టర్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని కొండాపూర్, మునిపల్లి సీఐ చంద్రయ్య సూచించారు. పోలీస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆన్లైన్ అప్లికేషన్ అనేది కేవలం మండపం నిర్వహణ, మండపానికి సంబంధించిన సమాచారం కోసం మాత్రమే ఆ పోర్టల్ రూపొందించినట్టు చెప్పారు. ఎటువంటి రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. tspolice.gov.in/index.htm Ð? https://policeportal. ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకుని.. స్థానిక స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్లను మండపంలో ఏర్పాటు చేయాలన్నారు. మండపాల్లో ఎట్టి పరిస్థితులోను డిజేలను ఏర్పాటు చేయొద్దన్నారు. గణేష్ మండపాల్లో ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు,ప్లాస్టిక్ సంచులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే తక్షణమే డయల్ 100గాని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హరిశంకర్ గౌడ్, పోలీస్ సిబ్బంది, వివిధ గ్రామాల యువకులు పాల్గొన్నారు.

గౌతాపూర్ హంస చెరువును పరిశీలించిన ఎస్ఐ



నవతెలంగాణ-వట్‌పల్లి

మండల పరిధిలోని గౌతాపూర్ హంస చెరువును ఎస్ఐ లక్ష్మణ్ మంగళవారం పరిశీలించారు. ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు హంసచెరువు నిండుకొని అలుగు దుంకుతున్నది. హంసచెరువు తెగిపోయి గౌతాపూర్ గ్రామానికి ప్రమాదం పొంచి ఉన్నదని.. అదేవిధంగా హంసచెరువుకు వెళ్లే రోడ్డు వరద తాకిడికి కొట్టుకుపోయిందని కొందరు సోషల్ మీడియాలో వదంతులు చెప్పడంతో.. హుటాహుటినా ఎస్సై హంస చెరువు వద్దకు చేరుకొని పరిశీలించారు. కానీ అక్కడ చెరువు కట్ట గానీ, రోడ్డు గానీ తెగిపోయినట్టు ఏమీ కనబడలేదన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దన్నారు. తప్పుడు ప్రచారాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామాలు మున్సిపాల్టీలో విలీనం

నవతెలంగాణ-పటాన్‌చెరు

అందరూ అనుకున్నదే అయ్యింది ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామాల ప్రజ గత కొంతకాలంగా ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామాలు గ్రేటర్ పరిధిలోకి తీసుకువచ్చే విధంగా ప్రభుత్వము కసరత్తు చేసింది. అందుకు అనుగుణంగానే ఈ మధ్యనే అధికారులు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి తీర్మానాలు చేసి అట్లా అధికారులు పంపించారో లేదో ఇట్లా.. డినోటిఫై చేస్తూ పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు.. గ్రామాలను మున్సిపాల్టీలో కలుపుతూ గెజిట్ జారీ చేసింది. పటాన్‌చెరు మండల పరిధిలోని.. పాటి, కర్ధనూరు, ఘనపూర్, పోచారం, ముత్తంగి గ్రామాలు తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోకి విలీనం కానున్నాయి. అమీన్పూర్ మండల పరిధిలోని.. ఐలాపూర్, ఐలాపూర్ తండా, కిష్టారెడ్డిపేట, పటేల్ గూడ, దాయర, సుల్తాన్పూర్ గ్రామాలు అమీన్పూర్ మున్సిపల్‌లో విలీనం కానున్నాయి. పంచాయతీలరికార్డులు మున్సిపాలిటీల అధికారులు స్వాధీనం చేసుకోనున్నారు.

గంజాయి కేసులో ఐదేండ్ల జైలు, 25వేల జరిమానా

నవతెలంగాణ-జోగిపేట

గంజాయిని అక్రమంగా తరలిస్తూ జోగిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో మెదక్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు పట్టుబడ్డ నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.25వేల జరిమానాను విధిస్తూ సంగారెడ్డి ఫస్ట్ అడిషనల్ సెషన్ కోర్టు మెజిస్ట్రేట్ కే.జయంతి మంగళవారం తీర్పు నిచ్చారు. 2019లో పది కిలోల ఎండు గంజాయిని విశాఖ పట్టణానికి చెందిన గార సన్యాసి రావు అక్రమంగా తరిలిస్తుండగా జోగిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో పట్టుకొని కేసు నమోదు చేశారు. నిందితుడికి జైలు శిక్ష తీర్పు వివరాలను జోగిపేట ఎక్సైజ్ సీఐ సాగర్‌రెడ్డి స్థానిక విలేకరులకు వివరించారు. అక్రమంగా గంజాయ ని తరలిస్తున్న కేసులో సరైన ఆధారాలను కోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.సత్యనారాయణ సమర్పించి నిందితుడికి శిక్ష పడేలా చూసారని సీఐ పేర్కొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ



నవతెలంగాణ-జోగిపేట

అందోల్-జోగిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు గుర్రపు సత్తయ్య వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో నాయకులు ఆయన చిత్రపటానికి మంగళవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన కుమారుడు గుర్రపు కృష్ణ సహకారంతో స్థానిక ప్రభుత్వ హాస్పిటల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు ఎస్. సురేందర్ గౌడ్, ఆకుల చిట్టిబాబు, డాకూరి శంకర్, రంగ సురేష్, కోరబోయిన నాగరాజు, దుర్గేష్, చందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాకూరి వెంకటేశం, పట్లోళ్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సత్తయ్య మృతదేహానికి నివాళ్లర్పించిన చుక్క రాములు



నవతెలంగాణ-సంగారెడ్డి

కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు కొత్తపల్లి మహేష్, శాండ్విక్ ఎంప్లాయ్ కొత్తపల్లి దీపక్ తండ్రి కొత్తపల్లి సత్తయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న శాండ్విక్ యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, చుక్కా రాములు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీ. మల్లేష్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతివేల మాణిక్, అస్తబల్ మంగళవారం రోజున సత్తయ్య మృత దేహానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళి అర్పించిన వారిలో సీఐటీయూ జిల్లా సహాయ కార్య దర్శి యాదగిరి, శాండ్విక్ ప్రొడక్షన్ హెడ్ జయప్రకాష్, ఫ్యాక్టరీ మేనేజర్ లింగరాజు, ప్రొడక్షన్ ఇంచార్జ్ దర్గా రెడ్డి, ఆఫీస్ బేరర్స్, పాండురంగారెడ్డి, మనోహర్, వెంకట్రావు, సదాశివరెడ్డి, వీరారావు ఉన్నారు.

వర్షాలకు భారీగా దెబ్బతిన్న రోడ్లు

ఎక్కడికక్కడ నిలిచిపోతున్న వాహనాలు

తాత్కాలిక మరమ్మత్తులకే రూ.5 కోట్లు అవసరం!



నవతెలంగాణ-జహీరాబాద్

గత నాలుగు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాల వల్ల ఓ పక్క నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. మరోపక్క మండల కేంద్రాల నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లు, నియోజకవర్గ కేంద్రం నుంచి మండలాలకు వెళ్లే ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖల రోడ్లు ఎక్కడికక్కడ దెబ్బతిన్నాయి. దాంతో రోడ్లపై పద్ద ఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. ప్రధానంగా ఝరాసంఘం, కోహిర్, జహీరాబాద్, న్యాల్కల్, మొగుడంపల్లి మండలాల్లోని ఆర్‌అండ్‌బి శాఖకు చెందిన ప్రధాన రోడ్లు జహీరాబాద్ నుండి బీదర్ వెళ్లే రోడ్డు, జహీరాబాద్ నుంచి చించొల్లి వెళ్లే రోడ్డు, జహీరాబాద్ నుండి కొత్తూరు వెళ్లే రోడ్డు, కోహిర్ నుండి గుడి గార్ పల్లి వెళ్లే రోడ్డు ,అల్లాదుర్గం మెటల్ కుంట, మిర్జాపూర్ రేజింతల్ రోడ్లు పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నది. దాంతో ఎక్కడికక్కడ బ్యారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాలను దారిమల్లి స్తున్నారు. సూచిక డివైడర్లను ఆ గుంతల్లోనే పెట్టి.. దారి మళ్లిస్తుండడం గమనార్హం. జహీరాబాద్ నియోజకవర్గంలోనే రోడ్ల మరమ్మతులకు కోటి రూపాయలు అవసరమని అధికారులు చెబుతున్నారు. బ్రిడ్జిలు, కల్వట్ల నిర్మాణానికి ఐదు కోట్లు అవసరం ఉన్నాయని ఆ శాఖకు సంబంధించిన అధికారులు ప్రాథమిక నివేదికలు తయారు చేసినట్టు తెలిసింది. ఈ విషయమై ఆర్‌అండ్‌బి డి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆరు నుంచి ఏడు కోట్లు ప్రాథమిక మరమ్మతులకు కావాల్సి ఉం దని నివేదికను తయారు చేసినట్టు తెలిపారు. వర్షాల కార ణంగా నియోజకవర్గంలోని ప్రధాన రోడ్లు సైతం పూర్తిగా దెబ్బతినడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. వర్షాకాలం ముగిసే వరకు ప్రయాణికులు రోడ్లపై వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలి

క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



నవతెలంగాణ-కొండాపూర్

ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొండాపూర్ మండలంలో నీటమునిగిన పంట పొలాలను మంగళ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు అనేక విషయాలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తుండడంతో పత్తి, మొక్కజొన్న, కంది, కూరగాయల పంటలు నీట మునిగిపోయి తీవ్రంగా నష్టపోయారన్నారు. ఒక ఎకరాకు రూ.50 వేల నష్టం జరిగిందన్నారు. నోటి దగ్గరకు వచ్చిన పంట నీటి పాలయిందని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కండ్ల ఎదుటనే నీటిలో మునిగిపోయి కన్నీళ్లు మిగిలించడం విచారకరమన్నారు. భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ, అగ్రికల్చర్ అధికారులు వెంటనే నీటి మునిగిన పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు. దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.25,000 నష్టపరిహారం చెల్లించి, బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని, రబీ సీజన్లో పంటలు వేసుకునేందుకు ఉచితంగా ఎరువులు, విత్తనాలు అందించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అంటువ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవా లన్నారు. ఇండ్లు కూలిపోయిన వారిని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె. రాజ య్య, మండల నాయకులు బాబూరావు,యోహను, రూప్ సింగ్ రైతులు పాల్గొన్నారు.

మండపాలకు పోలీస్ అనుమతి తప్పనిసరి

నవతెలంగాణ-వట్‌పల్లి

గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేయడానికి ఆన్‌లైన్‌లో పోలీసుల అనుమతి కోసం తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఐ లక్ష్మణ్ సూచించారు. గణేష్ విగ్రహాలు ఉన్నచోట కరెంటు వినియోగానికి ట్రాన్స్కో అధికారులను సంప్రదించి డిడి చెల్లించాలన్నారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతిరోజు ఇద్దరూ ఉత్సవ కమిటీ సభ్యులు ఉండాలన్నారు. మైకులు పెట్టేందుకు పోలీస్ అనుమతి అవసరమన్నారు. ఉదయం 6 గంటలు మొదలుకొని రాత్రి 10 గంటల వరకు మాత్రమే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విగ్రహాలను నిమజ్జనం చేసే రోజున శాంతియుత వాతావరణంలో విగ్రహాలను తరలించాలన్నారు.

గల్లంతైన జాలరి మృతదేహం లభ్యం

- చెట్లపోదల్లో దేహాన్ని గుర్తించిన సీఐ శ్రీను బృందం
- పోస్టుమార్టానికి కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలింపు





నవతెలంగాణ-బెజ్జంకి

గత రెండు రోజుల క్రితం మండల పరిధిలోని తోటపల్లి ఆన్‌లైన్ రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లి వరద ఉధృతికి గల్లంతైన జాలరి సందిరి లక్ష్మన్ మృతదేహం ఎట్టకేలకు మంగళవారం లభ్యమైంది. జాలరి అచూకీ కోసం రెస్క్యూ సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి ఉదయం నుంచి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు సీఐ శ్రీను బృందంలోని కానిస్టెబుల్ శ్రీనివాస్, స్థానిక యువకుడు వరద కాల్వలో చెట్ల పొదల్లో మృతదేహన్ని గుర్తించారు. అనంతరం అధికారులు మృతదేహన్ని వెలికితీసి పోస్ట్ మార్టమ్ నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

చివరి చూపు చూసే అవకాశం కల్పించారు

గత రెండు రోజులుగా గల్లంతైన జాలరి సందిరి లక్ష్మన్ అచూకీ కోసం పోలీస్ బృందాలు అహర్నిశలు శ్రమించి ఎట్టకేలకు మృతదేహన్ని వెలికితీసి కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు మృతదేహన్ని చివరి చూపు చూసే అవకాశం కల్పించారని సీఐ సహయ బృందానికి, పోలీస్ బృందాలకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జాలరి మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం

గల్లంతైన జాలరి సందిరి లక్ష్మన్ మృతి చెందడం బాధకరమని మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సంతాపం వ్యక్తం చేసినట్టు మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి తెలిపారు. మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఒదార్చారు. మృతుని కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్ గ్రేసీయా ప్రభుత్వం అందించేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు.

నాలుగు తులాల పుస్తెల తాడు అపహరణ

మహిళను పట్టుకొని దేహశుద్ధి చేసిన స్థానికులు



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

దొంగతనానికి పాల్పడ్డ మహిళను స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేసిన ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ఆర్ అండ్ ఆర్ కాలనీలోని కిష్టాపూర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ బి.సైదా కథనం ప్రకారం...ఆర్ అండ్ఆర్ కాలనీలోని కిష్టాపూర్‌లో కమలమ్మ అనే మహిళ వంటగదిలో వంట చేస్తుంది. అదే సమయంలో అక్కడికి వెళ్లిన ఇద్దరు మహిళలు ఒంటరిగా ఉన్న కమలమ్మను గమనించారు. ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు పుస్తెల తాడును దొంగిలించేందుకు పథకం వేశారు. అక్కడే ఉన్న కారంపొడి తీసుకొని కమలమ్మపై పోసి పుస్తెలతాడు దొంగిలించుకొని వెళ్లారు. వెంటనే కమలమ్మ అరవడంతో స్థానికులు చోరీకి పాల్పడ్డ వారిలో ఒక మహిళను పట్టుకొని దేహశుద్ధి చేశారు. ఆమె వద్దనున్న బంగారు పుస్తెలతాడును తీసుకొని బాధితురాలికి అందజేశారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారించి ఆ మహిళలను పోలీస్ స్టేషన్ తరలించి విచారణ జరిపి దొంగతనానికి పాల్పడిన మరో మహిళను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఇరువురు మహిళలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సైదా తెలిపారు.

బలవంతపు భూసేకరణ చేయొద్దు

ఫార్మాసిటీతో వ్యవసాయ భూములు, మంజీర నది కాలుష్యం బారిన పడే ప్రమాదం

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్

నవతెలంగాణ-సంగారెడ్డి

జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్కల్ మండలం డప్పూర్, వడ్డీ, మల్గి గ్రామాల్లో ఫార్మా కంపెనీల క్లస్టర్ ఏర్పాటు కోసం 2300 ఎకరాల భూసేకరణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2024 ఆగస్టు 23వ తేదీన గజిట్ విడుదల చేసిందని.. ఇప్పటికే ఆ ప్రాంతంలోని రైతులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్నారని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ అన్నారు. సంగారెడ్డి సుందరయ్య భవన్‌లో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీల క్లస్టర్ ఏర్పాటు కోసం రైతుల నుంచి బలవంతంగా భూములు సేకరించొద్దన్నారు. డప్పూర్‌లో 1500 ఎకరాలు, వడ్డీలో 280 ఎకరాలు, మల్గిలో 460 ఎకరాల భూములను తీసుకు నేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్నారు. అందులో 900 ఎకరాలు పేదల అసైన్మెంట్ భూములే అని.. దళితులు బలహీన వర్గాల పేదలు రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఈ ప్రాంతంలో ఫార్మా కంపెనీలు ఏర్పడితే వ్యవసాయ భూములు, చెరువులు, కుంటలు, గ్రౌండ్ వాటర్ కలుషితమై.. వాయు కాలుష్యం ఏర్పడి ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటాయన్నారు. మంజీరా నది జలాలు సింగూరు ప్రాజెక్టు వరకు పూర్తిగా కలుషితమవుతాయన్నారు. రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ చేయొద్దని, రైతులు చేస్తున్న ఆందోళనకు కేవీపీఎస్ సంపూర్ణ మద్దతిస్తున్న దన్నారు.ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు ఎం.యాదగిరి జిల్లా సహాయ కార్యదర్శి దాస్, జిల్లా కమిటీ సభ్యులు దత్తు తదితరులు పాల్గొన్నారు.



నల్లవాగు ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-సిర్గాపూర్

నారాయణఖేడ్ నియోజకవర్గంలోనే అతిపెద్ద ప్రాజెక్టు అయిన సిర్గాపూర్ మండల్ పరిధిలోని నల్ల వాగును ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మంగళవారం సందర్శించారు.ఆ ప్రాజెక్టుకు సంబంధించిన ఫుల్‌ట్యాంక్‌ను మెయింటెన్ చేసుకుంటూ నీటిని వృథా కానీవ్వకుండా ప్రాజెక్టు దిగువన ఉన్న కల్హేర్ మండలంలోని పలు గ్రామాల చెరువులకు కుడి కెనాల్ ద్వారా విడుదల చేయలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. వర్షాల వల్ల ఖమ్మం, వరంగల్, నల్గొండ మరియు ఇతర జిల్లాలలో ప్రలజకు ఎంతో నష్టం వాటిల్లిందన్నారు. బాధితులకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందన్నారు. సంగారెడ్డిలో తక్కువ వర్షపాతం ఉండడంతో ఎక్కువగా నష్టం జగలేదని.. నల్లవాగు ప్రాజెక్టు నిండుకుండలా మారడం సంతోషంగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిపార్ట్మెంట్ అధికారులు, నారాయణఖేడ్ ఆర్డీఓ, సిర్గాపూర్ తహసీల్దార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మట్టి వినాయకులను ఆవిష్కరించిన ఎస్పీ



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేయబడే ఉచిత మట్టి వినాయకులను సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు తోపాజీ ఆనంత కిషన్ వివరిస్తూ.. ఈయేడు సంగారెడ్డి పట్టణంలో వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా 5016 మట్టి వినాయకులను దాతల సహ కారంతో ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. పర్యావరణాన్ని కాపాడడానికి తమవంతు కృషిగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలియ జేశారు. వాసవి మా ఇల్లు చేస్తున్న కార్యక్రమాలను జిల్లా ఎస్పీ అభిన ందించారు. ఈ కార్యక్రమంలో వాసవి మా ఇల్లు సంస్థ ప్రధాన కార్యదర్శి పుల్లూరి ప్రకాష్, కొంపల్లి విద్యాసాగర్, కటకం విజయ్, నామ భాస్కర్, ఇరుకుల్లా ప్రదీప్, భక్త శ్రీనివాసులు రాచర్ల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లు కూలిన బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో వివిధ మండలాల్లోని పలు గ్రామాల్లో భారీ వర్షానికి ఇండ్లు కూలిన బాధితులను మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్‌రెడ్డి, గుర్రపు మచ్చేందర్ వేర్వేరుగా మంగళవారం పరామర్శించారు. కాగా బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. గుర్రపు మచ్చేందర్ బాధితులకు ఆర్థిక సాయం అందించారు..

వర్షాలతో కూలిన ఇండ్లు

నవతెలంగాణ-న్యాల్‌కల్

మూడ్రోజులుగా వీడని జోరు వానలతో మండలంలో 13 ఇండ్లు కూలినట్టు తహసీల్దార్ భూపాల్ తెలిపారు. మెటల్‌కుంటలో 5, రేజింతల్‌లో 4, ముంగిలో 1, టేకుర్‌లో 3 మొత్తంగా 13 ఇండ్లు కూలాయన్నారు. బాధితులకు ఒక్కొక్కరికి రూ.3,200 నష్టపరిహారం చెల్లిస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు



నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మండలంలోని ఐలాపూర్ గ్రామ పరిదిలోని సర్వే నంబర్ 1 నుంచి సర్వే నంబర్ 220లోని భూమి కోర్టు కేసుల్లో ఉందని, ఈ భూముల్లో ఆక్రమణలకు పాల్పపడితే కఠిన చర్యలు తీసుకుంటామని అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ తెలిపారు. సదరు సర్వే నంబర్లలోని భూముల్లో ఆక్రమణలకు పాల్పడినా.. భూస్వరూపం మార్చే ప్రయత్నం చేసినా.. చట్టరీత్యా శిక్ష తప్పదని హెచ్చరించారు. కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ భూముల్లో ఎవ్వరూ ఎంటర్ కావొద్దని ప్రజలకు సూచించారు. అలాగే మండల పరిధిలోని ప్రభుత్వ భూముల్లో కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణ సర్కార్ చెరువులు, కుంటల పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తుందని, వాటి జోలికి ఎవ్వరూ వెళ్లొద్దన్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే.. భవిష్యత్తులోనూ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని, చట్టబద్ధంగా ఇండ్లను నిర్మించుకుని సేఫ్ సైడ్‌లో ఉండాలని సూచించారు.

కాసాల పెద్దచెరువు సందర్శించిన తహసీల్దార్



నవతెలంగాణ-హత్నూర

మండల పరిధిలోని కాసాల పెద్దచెరువును తహసీల్దార్ పర్వీన్ షేక్ మంగళవారం సందర్శించి.. సంబంధిత అధికారులను పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. తూము గాడి లోపల నుంచి నీరు వృథాగా పోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నదని.. కాబట్టి నీరు వృథాపోకుండా అరికట్టాలని రైతులకు సూచించారు. భారీ వర్షాల వల్ల ఎలాంటి ప్రమాదలు పొంచి ఉండకుండా ఎప్పటికప్పుడు పరిశీలిం చాలని ప్రతి వర్షపు నీటిని కాపాడుకొని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, వెంకటేష్ గుప్తా, మల్లయ్య, ఆశయ్య, పోచయ్య వెంకటేశం, పెంటయ్య, తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది కత్తుల ప్రభు తదితరులు పాల్గొన్నారు.

శిరుర్ బ్రిడ్జి వద్ద రోడ్డు మూసివేత



నవతెలంగాణ-రాయికోడ్

ప్రధాన రహదారి అయిన సిరూర్ గ్రామ శివారులో గల రోడ్డును ఆర్డీఓ ఆదేశాలకు మేరకు మూసి వేసినట్టు డిప్యూటీ తాసిల్దార్ విజయకుమార్, స్థానిక ఎస్సై కృష్ణయ్య తెలిపారు. ఈ రహదారి మరమ్మత్తులు జరుగుతున్న సందర్భంగా గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా సింగూరు బ్యాక్ వాటర్ బ్రిడ్జి వద్ద రోడ్డు కూలిపోయిందన్నారు. రోడ్డుకు మరమ్మత్తులు జరిగే వరకు రాకపోకలు నిలిపివేస్తున్నట్టు చెప్పారు. వాహనదారులు నారాయణఖేడ్, వట్టిపల్లి, మెదక్ వెళ్లే వాహనాలను చిమ్నాపూర్ ఎక్స్ రోడ్ నుంచి పుల్‌కుర్తి మీదుగా ప్రయాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ సిస్టం నిర్వాహకుల బైండోవర్



నవతెలంగాణ-జహీరాబాద్

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించకూడదన్న ఉద్దేశంతో సౌండ్ సిస్టం నిర్వాహకులకు కౌన్సిలింగ్ నిర్వహించి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్టు ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. రాబోవు వినాయక ఉత్సవాల సందర్భంగా డీజేలు పెట్టకూడదని, సౌండ్ పొల్యూషన్‌కు కారణం కాకూడదని డీజే నిర్వాహకులందరినీ జహీరా బాద్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి తహసీల్దార్, జహీరాబాద్ ఎదుట ప్రొడ్యూస్ చేసి వారిని బైండ్ ఓవర్ చేసినట్టు చెప్పారు. మండపం వద్ద, నిమజ్జన ర్యాలీలో కూడా సింగిల్ బాక్స్ స్పీకర్ టైప్ సౌండ్ సిస్టమ్‌ంకు మాత్రమే అనుమతి ఉన్నదన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.


భారీ వర్షానికి కూలిన ఇళ్ళు



నవతెలంగాణ-కంగ్టి

మూడ్రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షానికి కంగ్టి గ్రామానికి చెందిన మహిబూబాబీ, చాప్ట కే గ్రామానికి చెందిన బసప్ప, రాచప్ప, సునీత, శివప్పలకు సంబంధించిన నాలుగు ఇళ్ల గోడలు కూలిపోయాయి. ఇంట్లో ఉన్న కుటుంబాలు రాత్రికి రాత్రే సురక్షత ప్రాంతానికి వెళ్లారు. వారికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. కాగా ఇంట్లో ఉన్న వస్తువులు, వంటసామాన్లు నానిపోయి తినడానికి లేకుండా.. ఉండడానికి ఇల్లు లేక, పిల్లలతో, రోడ్డున పడ్డామని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

భక్తులు ఇబ్బంది పడొద్దు..



నవతెలంగాణ-మనూర్

మండలంలోని బోరంచ నల్ల పోచమ్మ ఆలయానికి వచ్చే భక్తులు వర్షం వల్ల ఇబ్బంది పడకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ కార్యనిర్వహణ అధికారి శివారుద్రప్ప సూచించారు. గత నాల్గు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నందున భక్తులు గమనించి ఆలయానికి రాగలరు. ఒకవేళ రాకపోకలు సరిగా లేకుంటే.. వర్షం తగ్గిన తర్వాతైనా ఆలయానికి రావాలని సూచించారు.

శ్రావణమాసం ముగింపు సందర్భంగా ఆలయాల్లో పూజలు



నవతెలంగాణ-పుల్కల్

శ్రావణ మాసం ముగింపు సందర్భంగా పలు ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు. దేశానికి అన్నం పెట్టే రైతు పాడిపంటతో కళకళలాడాలని ఆకాంక్షించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భజన భక్తులు పెద్దగొల్ల విజయకుమార్, బురుగుపల్లి మల్లేశం, పర్వే గారి సత్యనారాయణ, పెద్దగొల్ల సుభాష్, బోడగామ అనంతం తదితరులు భజన భక్తులు పాల్గొన్నారు.

రైతులు జర భద్రం..!

- విద్యుత్ మరమ్మత్తులో నిర్లక్ష్యం వద్దు
- అప్రమత్తంతోనే ప్రమాదాలను అరికట్టగలం
- పంట రక్షణకు విద్యుత్ తీగలు ఉపయోగించొద్దు





నవతెలంగాణ-ఝరాసంగం

వ్యవసాయానికి ప్రస్తుతం విద్యుత్ వినియోగం తప్పనిసరైనది. పంటపొలాలకు త్రీ ఫేజ్ విద్యుత్ ఎక్కువగా ఉదయంతో పాటు రాత్రి పూట కూడా సరఫరా చేస్తుం టారు. కరెంట్ వచ్చినప్పుడు పంట పొలాలకు నీళ్ల పారించబోయే సమయంలో రైతులు ప్రమాదాలకు గురవు తుంటారు. స్టార్టర్ల బిగింపు, మోటార్ కనెక్షన్‌లు పెట్టే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కొందరు రైతులు జంతువుల బారినుండి పంటలను కాపాడుకునేందుకు కొన్ని ప్రాంతాల్లో పంట చుట్టు విద్యుత్ తీగలను అమరు స్తుంటారు. ఇవి కూడా ఒక్కోసారి మనుషుల ప్రాణాల మీదికి తెస్తాయి. ఈ ప్రమాదాల నివారణకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. స్టార్టర్లు, మోటార్లపై మూతలు బిగించాలి. ఏ కొద్ది తీగలు తెగిన వర్షాకాలంలో త్వరగా కరెంట్ షాక్ వచ్చే అవకాశాలు చాలా ఎక్కువ విద్యుత్ సరఫరాపై అవగాహన లేని రైతులు వాటికి దూరంగా ఉండడం చాలా మంచిది. వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లను సరిచేసే సమయంలో, ఆన్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాల బారినుంచి రక్షించుకోవచ్చు.

ఇనుప డబ్బాలను వాడకూడదు..

వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ స్టాటర్లను పొడి ప్రదేశంలో మోటార్లకు దగ్గరగా ఏర్పాటు చేసుకోవాలి. మోటార్ స్టాటర్ల ఏర్పాటు కోసం ఇనుప డబ్బాలను ఉపయో గించరాదు. అలా ఉపయోగిస్తే ఎలుకలు, బల్లులు డబ్బా లోకి ప్రవేశించి విద్యుత్ తీగలను కొరికితే, విద్యుత్ వైర్ తెగి ఇనుప డబ్బాకు విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదానికి దారి తీసే అవకాశం ఉంటుంది. రైతులు విద్యుత్ స్టాటర్లను ప్లాస్టిక్ డబ్బాల్లో ఏర్పాటు చేసుకోవడం మంచిది.

మోటార్ల వద్ద నిర్లక్ష్యం వద్దు..

విద్యుత్ మోటార్లను వర్షం, తేమ తగలని ప్రదేశానికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలి. మోటార్లపై రక్షణ కవచం ఏర్పాటు చేసినట్లయితే ప్రమాదాలు జరగకపోవడానికి ఆస్కారం ఉంటుంది. మోటార్ పంపు సెట్లను రైతులు సొంతంగా మరమ్మతు చేస్తుంటారు. వాస్తవానికి అలా చేయకూడదు. మంచి అనుభవజ్ఞులైన మెకానిక్‌లతోనే మరమ్మతు చేయించుకోవాలి. రైతులు మోటార్ల మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యం చేయకూడదు.

విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలి

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పొదలు ఉండకుండ రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. మోటార్లలో సమస్య ఏర్పడినప్పుడు రైతులు తమ పరిధిలోని లైన్‌మెన్‌లను మరమ్మతు కోసం సమాచారం అందించాలి. ఏ చిన్న విద్యుత్ సమస్య తలెత్తిన విద్యుత్ అధికారులకు సమాచారం అందించి మరమ్మతు చేయించుకోవాలి. రైతులు ఎట్టి పరిస్థితుల్లో కూడా ట్రాన్స్‌ఫార్మర్ల పైకెక్కి ఫ్యూజ్ వైర్లు సరిచేయరాదు.

విద్యుత్‌తో ప్రజలు అప్రమత్తగా ఉండాలి..

- సరళ, ఏఈ ఝరాసంగం

రైతులు చిన్న పాటి జాగ్రత్త చర్యలు పాటించక పోవడంతో పెద్ద ప్రమాదాలు జరుగుతుంటాయి. కరెంటు సమస్యలు ఏర్పడినప్పుడు అధికారులకు సమాచారం అందించాలి. రైతులు సిబ్బందికి సమాచారం ఇవ్వకుండా ట్రాన్స్‌ఫార్మర్లు ఆఫ్ చేసి మరమ్మత్తులు చేయకూడదు. లైన్ మెన్ వచ్చేంత వరకు వేచి చూడాలి. గత మూడు రోజుల నుంచి భారీ వర్షాలు కురవకపోవడంతో రైతులు బోరు మోటార్ల బోర్డుల వైపు చూసి ఉండకపోవచ్చు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తుండడంతో వాటిలో ఎలుకలు ఇతర కీటకాలు ప్రవేశించి వైర్లను కత్తిరించి ఉండవచ్చు, రైతులు తడి చేతులతో వాటిని ముట్టుకోవద్దు. సరైన మెకానిక్‌తో బాగుచేస్తే మంచిది. గ్రామాలలో పశువులను కరెంటు స్తంభాలకు కట్టకూడదు. ముఖ్యంగా చిన్నపిల్లలు కరెంటు స్తంభాల వద్ద ఆడకుండా జాగ్రత్త వహించాలి. స్టార్టర్లు, వైర్లు పనుల మరమ్మతుల విషయంలో రైతులు నిర్లక్ష్యం చేయకూడదు. కరెంటు స్తంభాలు, ఇంట్లో తడిసిన స్విచ్ బోర్డ్ లకు ప్రజలు దూరంగా ఉండాలి.



ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం

నవతెలంగాణ-సంగారెడ్డి

ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం అందిస్తున్నట్లు ఎస్‌టీయూటీఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సాబేర్ అలీ, శ్రీనివాస రాథోడ్ తెలిపారు. ఎస్టీయూ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల జనజీవనం స్తంభించిపోయిందన్నారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం, నల్గొండ తదితర జిల్లాల్లో పర్యటిస్తూ.. ప్రాణ నష్టాన్ని తిరిగి ఇవ్వలేం కానీ మానవత దృక్పథంతో ఆర్థికంగానైనా ఆదుకోవాలని పిలుపునిచ్చారన్నారు. దాంతో ప్రభుత్వంలో భాగస్వాములైన ఉద్యోగులు తమ వంతు సహాయంగా ఒకరోజు బేసిక్ పేను ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా అందించడం గొప్ప విషయమన్నారు. తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులు ఒకరోజు మూలవేతనపు మొత్తాన్ని సెప్టెంబర్ నెల జీతం నుండి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాల్సిందిగా ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేసినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రమణ కుమార్ ,రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ కుమార్, జిల్లా నాయకులు సమీ, ప్రతాపరెడ్డి,విజయకుమార్, నారాయణ, అంజద్ ,ఎన్. కెశాలి, ఖయ్యూం,రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులను ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ పరిధిలోని మంగళపేట్‌లో నివాసముంటున్న పశువుల శ్రీనివాస్, ఇప్పలి అంబదాస్, వై.శాంతమ్మ ఇండ్లు భారీ వర్షానికి కూలిపోయాయి. ఈ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే సంజీవ రెడ్డి.. బాధిత కుటుంబాలను పరామర్శించారు. నిత్యవసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ జగ్ జీవన్, మున్సిపల్ చైర్మెన్ ఆనంద్ స్వరూప్ షెట్కర్, మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ సేట్ , హనుమాండ్లు కౌన్సిలర్, ఇప్పలి బాలయ్య రామన్న నర్సింలు ఉప్పరి రాములు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మురుగులోనే ప్రయాణం..!

- విషకీటకాలు, దోమల స్వైర విహారం
- రోడ్డుపై చెరువుల తలపిస్తున్న మురుగు నీరు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



నవతెలంగాణ-ఝరాసంగం

మండలం పరిధిలోని పొట్టిపల్లి గ్రామంలో మురుగునీరు ప్రధాన రోడ్డుపై చెరువులను తలపిస్తోంది. జనావాసాల మధ్య మురుగు పారడంతో ఆ చుట్టుపక్కల నివసించే ప్రజలతోపాటు ప్రయాణికులను సైతం ముప్పు తిప్పలు పడుతున్నారు. గ్రామంలోని పొట్టి పల్లి టు ఎల్గోయికి వెళ్లే దారి పక్కన ఉన్న చెత్త కుప్పల వల్ల వస్తున్న దుర్గంధంతో ఆ చుట్టుపక్కల నివసించే ప్రజలు ముక్కున వేలేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ దారి గుండా ఎల్గోయి, రేజింతల్, బర్దిపూర్ గ్రామాలకు ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. చెత్త కుప్పలతో పాటు రోడ్డు పక్కల ఉన్న ఇండ్లలోని మురుగునీరు రోడ్లపైకి వెళ్లడంతో రోడ్డు మొత్తం చెరువును తలపిస్తోంది. మురుగునీరు రోడ్డుపైన నిలవడంతో విషసర్పాలు, క్రిమి కీటకాలు, దోమలు వృద్ధి చెంది స్వైర్య విహారం చేస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న నివాసగృహాల్లోకి దోమలు, విషసార్పాలు చొరబడుతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులకు ఇక్కడి పరిస్థితులు తోడై సీజనల్ వ్యాధులను విస్తరింప చేస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందు తున్నారు. ఇక్కడి మురుగు కాలువలో దోమలు వృద్ధి చెంది పగలు, రాత్రి అన్న తేడా లేకుండా నివాసులను నిరంతరా యంగా వెంబడిస్తున్నాయి. వారి రక్తాన్ని జలగల్లా తాగేస్తున్నాయి.

ఇలా అన్ని విధాలుగా ఈ మురుగు కాలువలో మూడు గ్రామాల పరిధిలోని వందలాది ప్రజలను తీవ్ర అనారోగ్యపాలు చేస్తున్నా అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆవేదన చెందుతున్నారు. తమ సమస్యలపై పత్రికల్లో కథనాలు వెలువడినా స్పందించేవారు లేరని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ అయినా తమ గోడును ఆలకించి మూడు గ్రామాల ప్రజలకు ఇబ్బందిగా మారిన చెత్త కుప్పలను తొలగించి, ముళ్లపొదలను, పిచ్చిమొక్కలను తొలగించి మురుగునీటిని లోతట్టుకు ప్రవహించేలా కాలువను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. లేకపోతే నిత్యం తీవ్ర అనారోగ్యాలతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు, వాహనదారులు ప్రాధేయపడుతున్నారు.

వినాయక పండగను శాంతియుతంగా జరపాలి



నవతెలంగాణ-జోగిపేట

వినాయక పండుగను శాంతియుతంగా జరపాలని సంగారెడ్డి డీఎస్పీ సత్యన్న సూచించారు. జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్ హాల్లో మంగళవారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక మంటపాలకు పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు. హిందూ ముస్లింలు కలిసిమెలిసి రెండు పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. డీజేలను వాడి ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని ఆయన సూచించారు. మంట పాల నిర్వాహకులు అందరూ ఒకే రోజు వినాయక నిమజ్జనాలు తీస్తే బాగుంటుందన్నారు. మున్సిపల్ శాఖ వారు స్వాగతం ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. పోలీస్ బందోబస్తు కూడా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పాండు, సీఐ అనిల్ కుమార్, కమిషనర్ తిరుపతి, ఉప తహసిల్దార్ మధుకర్ రెడ్డి, ఎస్సై పాండు, ఏఈ శ్రీనివాస్, కౌన్సిలర్లు ఎస్ సురేందర్ గౌడ్, ఆకుల చిట్టిబాబు, రంగ సురేష్, దాకురి శంకర్, కోరబోయిన నాగరాజు, ఆయా పార్టీల నాయకులు డాకూరి వెంకటేశం, పట్లోళ్ల ప్రవీణ్, ఆర్ ప్రభాకర్ గౌడ్, నాగరత్నం గౌడ్, వెంకటేశం, ఎండి అరుఫత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఉంటే తీసుకోండి

నా భూమి నాకు సర్వే చేసి ఇవ్వండి

మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి



నవతెలంగాణ-అమీన్‌పూర్

'సర్వే నంబరు 461లో ప్రభుత్వ భూమి ఉంటే తీసుకోండి.. నా భూమి నాకు సర్వే చేసి ఇవ్వండి' అంటూ అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నాలుగేండ్లుగా తన భూమిని సర్వే చేయకుండా కాలయాపన చేసి.. హుటాహుటినా కూల్చివేశార న్నారు. ప్రజల్లో తనను డ్యామేజ్ చేయాలనే కుట్రతోనే కూల్చివేతలు చేపట్టా రన్నారు. సర్వే నంబరు 462లో ప్రభుత్వ భూమి ఉంటే.. సర్వే నంబరు 461లో కూల్చివేతలు చేపట్టారని ఫైర్ అయ్యారు. దీనిపై ఖచ్చితంగా లీగల్‌గా ముందుకు వెళ్తానన్నారు. కోర్టు నాలుగు వారాల గడువు ఇచ్చినా.. ఆ ఆదేశాలను పక్కకు నెట్టి చిన్నాచితక పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారిపై కనికరం లేకుండా కూల్చివేతలు చేపట్టారన్నారు. మున్సిపల్ చైర్మెన్ అయిన నాకే ఇలాంటి పరిస్థితి ఉంటే.. సాధారణ పౌరుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కూల్చివేతలపై నోటీసులు ఇవ్వడంపై అడిగేందుకు వెళ్తే.. అధికారులు ఒకరిపై మరొకరు సాకులు చెప్పుకుంటూ కావా లనే సమయం దాటవేశారని ఆరోపిం చారు. నాలుగేండ్లుగా సర్వే చేయకుండా కాలయాపన చేసి నేడు కూల్చివేతలు చేప టడం సరికాదన్నారు. నిజానికి తహసీల్దార్‌కు ఈ భూమిపై ఇప్పటికే క్లియర్‌గా చెప్పామని.. అయినా కూల్చివేశారని చెప్పు కొచ్చారు. 461 సర్వే నంబరు లోని భూమి అమీన్‌పూర్‌కు చెందిన వ్యక్తులదని, దాన్ని గతంలో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులకు విక్రయించారని తెలిపారు. ఏడు సంవత్సరాల క్రితం నేను కొనుగోలు చేశానని గుర్తు చేశారు.



పేద కుటుంబానికి సాయం

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రానికి చెందిన ఎర్రవల్లి బాలయ్య భార్య అనసూయ గుండె నొప్పితో మృతి చెందింది. వారిది నిరుపేద కుటుంబం కావడంతో.. స్థానికులు ఈ విషయాన్ని మాజీ ఎంపీపీ దమ్మగౌని రవీందర్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి.. ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యనగండ్ల నరేందర్ ,కోంబోయిన నరేష్, విష్ణుమూర్తి చారి, భాస్కర్, రవి ,ఎర్రవల్లి బాలు పలువురు యువ నేతలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవు

నవతెలంగాణ-పుల్కల్

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని పుల్కల్ ఎస్సై క్రాంతి కుమార్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వల్ల పొలాలకు వెళ్లే, ఇతర పనుల మీద బయటికి వెళ్లే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాబట్టి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం పుల్కల్ మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎస్ఐ పర్యవేక్షించారు.

ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-హత్నూర

మండలంలోని మధుర గ్రామంలో మల్లారెడ్డి హృదయ హాస్పిటల్ సూరారం వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామంలో ఉన్న వృద్ధులు, రోగులు సుమారుగా 150 మంది ఈ శిబిరంలో పాల్గొన్నట్టు వైద్యులు తెలిపారు. కీళ్ల నొప్పులు, దగ్గు, జ్వరం, కంటి, బిపి లాంటి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కోలని రవి మాట్లాడుతూ.. ఈ శిబిరంలో పలువురికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ఈ వైద్య బృందం గ్రామంలో ఉచితంగా వైద్యం అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఏ.కృష్ణ సాయి, డాక్టర్ సిహెచ్. రూపిని, గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గోడ కూలి బైక్‌లు ధ్వంసం..



నవతెలంగాణ-కోహీర్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని కోహీర్ పట్టణంలో గల మహమ్మద్ రఫీకి చెందిన ఇంటి గోడలు కూలి రెండు బైక్‌లు ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

కూలిన ఇళ్లను పరిశీలించిన అధికారులు



నవతెలంగాణ-టేక్మాల్

భారీ వర్షాలకు మండల పరిధిలోని, తంప్లూర్, టేక్మాల్, పాల్వంచ, వెంకటాపూర్, తండాలలో, కూలిన ఇండ్లను తహసీల్దార్ తులసీరామ్ ఆర్ఐ సాయి శ్రీకాంత్ సందర్శించి పరిశీలించారు. గ్రామపంచాయతీలలో తాత్కాలిక ఆవాస కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రమాదకరంగా ఉన్న ఇళ్లను గుర్తించి పంచాయతీ కార్యదర్శులు వాటిని నేలమట్టం చేయాలని ఆదేశించారు. ఒక్క ప్రాణ నష్టం కూడా జరగకుండా చూడాల్సిన బాధ్యత కార్యదర్శులపైన ఉందన్నారు. కార్యదర్శులు గ్రామస్తుల సహకారంతో సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్న కుంటలను చెరువులను సందర్శించి వాటిని సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రమాదకరంగా గండ్లు పడిన కుంటలను షట్టర్లు లేని కుంటలను గుర్తించి తాత్కాలిక మరమ్మతులు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాయి శ్రీకాంత్ ఆర్ఐ, తంప్లూర్ మాజీ సర్పంచ్ ఆకుల నాగయ్య, యువజన నాయకుడు నాయకుడు భాస్కర్ తదితరులు ఉన్నారు.

బాధితులను పరామర్శించిన ఎంపీడీవో



నవతెలంగాణ-నిజాంపేట

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఈ వర్షాలకు ఇండ్లకు కూలిపోయిన బాధిత కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్‌లో నివాసం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో రాజిరెడ్డి అన్నారు. అకాల వర్షాలకు ఇల్లు కూలిపోయిన నిర్వాసితులకు డబుల్ బెడ్రూంలో ఆశ్రయమించామన్నారు. శిథిల వ్యవస్థలో ఉన్న ఇండ్లలో ఎవరు ఉండకూడదని ఈ వర్షాకాలం ఉన్నన్ని రోజులు డబుల్ బెడ్ రూమ్‌లో నివసించాలన్నారు. ఈ కార్యక్రమంలోఏపీఓ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి ప్రశాంత్ గౌడ్,

15వ జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం నూతన కమిటీ

నవతెలంగాణ-తూప్రాన్

మెదక్ జిల్లాలో నవంబర్ 2,3 తేదీలలో తూప్రాన్‌లో నిర్వహించనున్న సీపీఐ(ఎం) 15వ జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా సీనియర్ నాయకులు ఎండి సర్దార్ ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఉపాధ్యక్షులుగా కె.నర్సమ్మ (జిల్లా కార్యవర్గ సభ్యులు), కె.మల్లేశం (మెదక్ సీపీఐఎం పార్టీ జిల్లా కార్యదర్శి), కె.బాగమ్మ (టేక్మాల్ మండల నాయకులు), లక్ష్మీనర్సమ్మ (పార్టీ సీనియర్ నాయకులు), డి.మల్లేశం (జిల్లా కమిటీ సభ్యులు), బి.భాగయ్య (పార్టీ నాయకులు), సిహెచ్.శౌరయ్య (వెల్దుర్తి మండల కన్వీనర్), బాబు (నిజాంపేట మండల నాయకులు), ప్రధాన కార్యదర్శిగా ఏ.మల్లేశం (సీపీఐఎం జిల్లా కార్యదర్శి), కోశాధికారిగా మహేందర్ రెడ్డి (జిల్లా కార్యవర్గ సభ్యులు), తూప్రాన్ ఏరియా కార్యదర్శులు ఎన్నికయ్యారు. అదేవిధంగా సహాయ కార్యదర్శులుగా బి.బస్వరాజు (జిల్లా కార్యవర్గ సభ్యులు) బి.బాలమణి (మెదక్ ఏరియా కమిటీ సభ్యులు), కె.నాగరాజు (నర్సాపూర్ మండల కార్యదర్శి), జె.సంతోష్ (జిల్లా కమిటీ సభ్యులు), టి.మల్లేశం, ముత్యాలు (శివ్వంపేట శాఖ కార్యదర్శి), తుకారం (పెద్ద శంకరంపేట శాఖ కార్యదర్శి) సిహెచ్.అజయ్ కుమార్ (సెంటర్ శాఖ కార్యదర్శి), లచ్చగౌడ్ (మెదక్ ఏరియా కమిటీ సభ్యులు), చింతల సత్తయ్య, (కొల్చారం శాఖ కార్యదర్శి), డి.దాసు (నర్సాపూర్ ఏరియా కమిటీ సభ్యులు), కార్యవర్గ సభ్యులుగా కుమార్ (దౌంతి శాఖ సభ్యులు), నాగరాజు, రమేష్ (తూప్రాన్ శాఖ సభ్యులు), వెంకట్ (వెల్దుర్తి శాఖ సభ్యులు) సాయిలు (వెల్దుర్తి శాఖ సభ్యులు), దుర్గ, నర్సింలు (కౌడిపల్లి సభ్యులు), కె.ప్రవీణ్ (చేగుంట శాఖ సభ్యులు), రామస్వామి, దేవయ్య, నాగమణి తదితరులు ఎన్నికయ్యారు.

అలుగు పారడంతో రైతుల సంతోషం

- మాజీ వైస్ ఎంపీపీ సున్నం సతీష్



నవతెలంగాణ-కౌడిపల్లి

మండల పరిధిలోని ముత్రాజ్ పల్లి చెరువు కలుగుపారడంతో మాజీ వైస్ ఎంపీపీ సున్నం సతీష్ ఆనంద వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ముత్రాజ్ పల్లి చెరువు కలుగు పారకపోవడంతో ప్రస్తుతం రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువు అలుగు పారడంతో చెరువు కింద ఉన్న రైతులు పంటలు బాగా పండుతాయి అని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు చేసి మొక్కు తీర్చుకున్నారు. అలాగే మత్స్యకారులకు చేపలు పెంచుకొని ఉపాధి దొరుకుతుందని ఆయన అన్నారు. చెరువు వద్దకు వెళ్లి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వెంకటేశం, రైతులు మగ్దూం, సాలయ్య, లక్ష్మయ్య, గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు.

అలుగు పారుతున్న గంగమ్మకు ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-నార్సింగి

భారీగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధి గ్రామంలోని శేరిపల్లి గ్రామ చేరువైన గుండు చెరువు నిండి అలుగు పారుతుంది. వర్షా కాలం తొలి నాళ్లలో వర్షాలు సరిగా లేక కరువును తలపించే కాలం తో రైతులు ఆగమవుతున్న సమయంలో గ్రామ చెరువు పూర్తిగా నిండడం, అలుగు పారుతుండడం తో రైతన్నలు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్, సీనియర్ నాయకుడు లక్ష్మి నరసింహులు, యూత్ నాయకుడు బాలకృష్ణ మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, డ్యామ్ లు నిండి అలుగులు పారుతున్నాయని, శేరిపల్లి గుండు చెరువు అలుగు పారడంతో సంతోషంగా ఉందని, చెరువు ఆయకట్టు క్రింద గల శేరిపల్లి, మీర్జాపల్లి గ్రామాలకు చెందిన దాదాపు 500 ఎకరాల లో ఈ ఏడు పంటలు పుష్కలంగా పండుతాయని హర్షం వ్యక్తం చేశారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మాజీ ఉప సర్పంచ్ బాలాజీ, మాజీ వార్డు సభ్యుడు నరసింహులు గౌడ్, గౌడ్ సంఘం అధ్యక్షుడు చిన్న కృష్ణా గౌడ్, చిన్న బాబు, మోతీలాల్, పెంటయ్య, కిష్టయ్య, యాదగిరి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు చేసుకోవాలి

- ఎస్సై శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-పాపన్నపేట

ప్రజలు ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి పండుగను చేసుకోవాలని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గణేష్ ఉత్సవాల నేపథ్యంలో మంగళవారం పాపన్నపేటలోని మంజీరా గార్డెన్స్‌లో నిర్వాహకులతో శాంతి సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ. ప్రజలకు ఇబ్బందులు లేకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల ఏర్పాటుకు ఆన్ లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. నిమజ్జన సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద రాత్రివేళ కాపాల ఉండాలని చెప్పారు. భక్తి శ్రద్ధలతో పండుగను జరుపుకోవాలన్నారు. ఏఎస్ఐ సంగన్న, సిబ్బంది బస్వరాజ్, దుర్గాప్రసాద్, నానుసింగ్, ప్రవీణ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు కూలిన ఇల్లును పరిశీలించిన ఎమ్మార్వో



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని వెంకటాపూర్ (కె)గ్రామంలో భారీ వర్షాల కారణంగా కూలిపోయిన ఇండ్లను మంగళవారం స్పెషల్ అధికారి స్థానిక తహసీల్దార్ సురేష్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు గ్రామంలో 12 మంది ఇండ్లు కూలిపోయాయన్నారు. ఇండ్లు కూలిపోయిన వారి వివరాలను పై అధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్రేమలేఖ, గ్రామస్తులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జెడ్పీసీఈఓ ఎల్లయ్య



నవతెలంగాణ-కొల్చారం

గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. మంగళవారం మండలంలోని రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన పాఠశాల ఆవరణలో భారీగా చేరిన వర్షపు నీటిని పరిశీలించారు. ఎక్కడ కూడా నీటి నిల్వ ఉండకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి రజితకు సూచించారు. అలాగే శిథిలావస్థకు చేరిన నివాస గృహాల్లో ఉండకూడదని, ప్రమాదకర విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దన్నారు. భారీ వర్షాల పట్ల అధికార యంత్రం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

చదువుకోమన్నందుకు విద్యార్థి ఆత్మహత్య

- ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న కూతురు



నవతెలంగాణ-తూప్రాన్

పిల్లలు బాగా చదవాలని ప్రతి ఒక్క తల్లితండ్రులు కోరుకుంటారు. కాని ఓ అమ్మాయికి అదే శాపంగా మారింది. తూప్రాన్ పట్టణ పరిధిలోని ఆబోతుపల్లికి చెందిన 10 వతరగతి విద్యార్థిని మంగళవారం రోజున ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నక్కపల్లి మహేందర్ కూతురు (15) తూప్రాన్ బాలికల హైస్కూల్లో పదోతరగతి చదువుతోంది. మంగళ వారం మధ్యాహ్నం అన్నం తినే సమయంలో తండ్రి మహేందర్ మంచిగా చదువుకోవాలని కూతురుతో చెప్పి గేదేలు మేపేందుకు వెళ్లాడు. తన కూతురు బాగా చదువుకోవాలని చెప్పినందుకు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని తన కుమారుడు ద్వారా విషయం తెలుసుకున్న తండ్రి మహేందర్ ఇంటికి వచ్చి చూసేసరికి కూతురు బెడ్ రూమ్‌లో ఉరేసుకొని మృతి చెందింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి తూప్రాన్ పోలీసులు చేరుకున్న తూప్రాన్ ఎస్ఐ శివానంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారిని సస్పెండ్ చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం



నవతెలంగాణ-మెదక్ టౌన్

మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం అన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవనంలో హమాలీ కాలనీ గుడిసెల పోరాట కమిటీ అధ్యక్షులు సిహెచ్ లచ్చ గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని సర్వే నెంబర్ 248/1లో గల హమాలి కాలనీలో గత ప్రభుత్వం1992 సంవత్సరంలో హమలీ కార్మికులకు అసైన్మెంట్ కమిటీ ద్వారా ఐదు ఎకరాల 39 గుంటలు హమలీ కార్మికులకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిందన్నారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ పేదల నుంచి లాక్కోవడానికి ప్రయత్నం చేస్తుందని, సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమి సుమారుగా 25 నుంచి 30 ఎకల వరకు ఉన్నదని, కొంత మంది ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అమ్ముకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. నాటి ప్రభుత్వం 114 మంది హమాలీ కార్మికులకు పట్టాలు ఇచ్చిందని, అనంతరం హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇచ్చి 44 మందికి ఇండ్లు నిర్మించి ఇచ్చారని తెలిపారు. నేటి వరకు కార్మికులు ఇంటి నిర్మాణ రుణం తీర్చుకున్నారని, ఖాళీగా ఉన్న భూమిలో పట్టాలు ఉన్న వారు కొంత మంది పేదవాళ్లు గత మూడు సంవత్సరాల క్రితం నుంచి గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని, నివాసం ఉండడం వలన ప్రభుత్వ భూమిని కాపాడగలిగామని తెలిపారు. చుట్టు పక్కల ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి ప్రభుత్వ భూమిలో ఇల్లు కట్టుకోవడానికి కబ్జాలు చేసుకోవడానికి సహకరిస్తున్నారని ఆరోపించారు. టౌన్ ప్లానింగ్ అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం, గుడిసెల పోరాట కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు. హమాలి కాలనీలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలపై పలుమార్లు పార్కు ఉన్నదని పార్కు ప్లేసులో గుడిసెలు వేశారని నోటీసులు ఇవ్వకుండా కూల్చారు. పార్కు జాగా ఎంత ఉందని గుడిసే వాసులు ప్రశ్నిస్తే సర్వే చేసి హద్దులు చూపిస్తానని ఏప్రిల్ 17వ తారీఖున గుడిసెల వద్దకు వచ్చి హామీ ఇచ్చిన మున్సిపల్ ప్లానింగ్ అధికారి ఇప్పటివరకు హద్దులు చూపకుండా కబ్జాకు ప్రయత్నిస్తున్న ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కై కలెక్టర్‌కు గుడిసెలు తొలగించాలని దరఖాస్తులు చేయిస్తున్నారన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారి మద్దతుతో సర్వేనెంబర్ 248/1 లో రైతు వేదిక ఎడమ భాగాన, సఖి కేంద్రం పక్కన నిర్మాణాలు జరిగాయని తెలిపారు. ఇవన్నీ మున్సిపాల్ ప్లానింగ్ అధికారికి కనబడటం లేదా ప్రభుత్వ భూమి కాదా అని ప్రశ్నించారు. వ్యాపారులకు మద్దతిస్తూ గుడిసెలు వేసుకున్న వారిని తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ భూమి కాపాడాలని, అక్రమంగా కబ్జా చేసి, చేపట్టిన నిర్మాణాలు, కట్టడాలను కూల్చివేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కు హద్దులను చూపించి గుడిసెలు వేసుకున్న వారికి ఆ భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్దమ్మ, నాగమణి, సత్యమ్మ అంజమ్మ, యాదగిరి, కమల తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల నిర్వహణకు పకడ్బందీగా చర్యలు

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పర్యావరణ రహితమైన మట్టి విగ్రహాలను వినియోగించి భక్తులు బాధ్యతాయుతంగా పూజించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయపు కాన్ఫరెన్స్ హాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహణపై పోలిస్, రెవెన్యూ, పంచాయితి రాజ్, విద్యుత్, మున్సిపాల్టీ, మత్స్యశాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను వినియోగించి భక్తులు బాధ్యతాయుతంగా పూజించాలని ఆయన కోరారు. మట్టి వినాయకులను నెలకొల్పి పూజించడంతో పర్యావరణానికి మేలు కలుగుతుందన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో అధికారులు నిమజ్జనానికి ఉత్సవ కమిటీలతో సమన్వం చేసుకుని ఏర్పాట్లు చేయాలని సూచించారు. గణపతి నిమజ్జనం జరిగే చెరువులు, వాగులు, గోదావరి నది వద్ద పోలిస్ శాఖ తరుపున పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం మట్టి వినాయకులను నెలకొల్పి పూజించడంతో పర్యావరణానికి మేలు అనే నినాదంతో జిల్లా కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ, ఉదయ్ కుమార్ మెదక్ ఆర్‌డిఓ రమాదేవి తూప్రాన్ ఆర్డీవో జై చంద్రారెడ్డి, సంబంధిత పోలీస్ రెవిన్యూ ఇరిగేషన్ ఎలక్ట్రిసిటీ మునిసిపల్, పంచాయతీ సంబంధిత శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

- మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను పప్రభుత్వమే ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా హవేలీ ఘన్పూర్ మండల కేంద్రంలో ఉన్న పెద్ద చెరువుకు గండి పడి దాదాపుగా 200 ఎకరాల వరకు వరి పంట నీట మునిగింది. గండిపడ్డ పెద్ద చెరువును, నీట మునిగిన వరి పొలాలను మంగళవారం పద్మాదేవేందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువుకు బుంగ పడినప్పుడు ముందస్తు చర్యలు చేసి ఉంటే ఇంత పెద్ద మొత్తంలో విపత్తు జరిగి ఉండేది కాదన్నారు. రైతులకు నష్టపరిహారం కింద తక్షణమే ఎకరానికి రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇంత పెద్ద మొత్తంలో నష్టం జరిగిందన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినా ప్రభుత్వం మొద్దు నిద్రపోవడం వలన రాష్ట్రంలో 32 మంది చనిపోయారన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఏ విధంగా వరద బాధితులను అదుకుందో అదేవిధంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తెగిపోయిన ఘనపూర్ పెద్ద చెరువు కట్టకు ఇసుక బస్తాలు వేసి నీటిని ఆపాలని, కట్టను పునరుద్ధరించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఇరిగేషన్ అధికారులు స్పందించకపోతే గ్రామస్తులతో తెగిన కట్టను పూడ్చుకుంటామని తెలిపారు. వీరి వెంట హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు ఏం లావణ్య రెడ్డి, నాయకులు కిష్టయ్య, మేకల సాయిలు, రామచంద్ర రెడ్డి, సతీష్ రావు, నరేందర్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

బాయ్స్ రెసిడెన్షియల్ హాస్టల్ ప్రిన్సిపాల్‌ని సస్పెండ్ చేయాలి

- ప్రిన్సిపాల్ చొరవతోనే రౌడీల్లా మారుతున్న విద్యార్థులు
- విద్యార్థులతో అనేక పనులు చేయించుకుంటున్న ప్రిన్సిపాల్
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్



నవతెలంగాణ-మెదక్ టౌన్

తూప్రాన్ టోల్ గేట్ దగ్గర ఉన్న బాయ్స్ రెసిడెన్షియల్ హాస్టల్ ప్రిన్సిపాల్‌ని సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ డిమాండ్ చేశారు. విద్యార్థులను మదక ద్రవ్యాలు వినియోగించేలా ప్రిన్సిపాల్ ప్రేరేపిస్తున్నాడని, క్రమశిక్షణ లేకుండా చేస్తున్నాడన్నారు. మెదక్ జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్‌కు నిలయంగా బాయ్స్ రెసిడెన్షియల్ హాస్టల్ మారిందని, విద్యార్థులు క్రమశిక్షణ లేకుండా పోయారన్నారు. దీనికి కారణం ప్రిన్సిపాల్ నిర్లక్ష్యమేనని ఆయన మండిపడ్డారు. విద్యార్థులను బూతులు తిడుతున్నారని, విద్యార్థులను పక్కదారి పట్టించేలా ప్రిన్సిపాల్ చూస్తున్నారని ఆయన అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జూలై నెలలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు జగన్ సందర్శించినప్పుడు అక్కడ ఉన్న ప్రిన్సిపాల్ మీకు ఏం పని అంటూ ఘాటుగా మాట్లాడారని, ఈ సందర్భనలో చాలా సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. పిల్లలకు పౌష్టికాహారం పెట్టడం లేదని కుళ్ళిపోయిన కోడిగుడ్లు విద్యార్థులకు పెడుతున్నారని, బాత్రూంలు సరిగ్గా లేవని అక్కడ ఉన్న లెక్చరర్స్ క్రమశిక్షణలో లేరన్నారు. తక్షణమే ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ప్రజలను కాపాడేందుకే పోలీసులు



నవతెలంగాణ-టేక్మాల్

ప్రజలకు ఆపద వచ్చినప్పుడు ప్రాణాలను లెక్కచేయకుండా వారిని కాపాడడమే పోలీసుల లక్షణమని ఏఎస్ఐ దయానంద్ తెలిపారు. టెక్మాల్ పోలీస్ స్టేషన్ పరిధి గుండు వాగులో 45 ఏళ్ల ఓ వ్యక్తి బ్రిడ్జిని దాటడానికి ప్రయత్నిస్తూ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. వాగులో కొట్టుకుపోతూ. వాగు లోపల ఓ బండ రాయిని పట్టుకొని ఆగిపోయాడు. ఈ క్రమంలో అతడిని గమనించిన మహేష్ (హెచ్.జి 96) వెంటనే రంగంలోకి దిగారు. మహేష్‌తో పాటు మరో ఇద్దరు యువకులు తాడు సహాయంతో కల్వర్టు మధ్యలోకి చేరుకోని, అందరూ ఒక జట్టుగా ఏర్పడి. ప్రమాదంలో చిక్కుకున్న వ్యక్తిని వరద ప్రవాహ నుంచి తాడు సహాయంతో నెమ్మదిగా నీళ్లలో నుంచి బయటకు సురక్షితంగా తీసుకువచ్చారు. తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వాగులో చిక్కుకున్న వ్యక్తిని కాపాడిన జిల్లా క్యూ.ఆర్.టి. సభ్యులు మహేష్, బండి శ్రీనివాస్, సురేష్ నాయక్ , కృష్ణ, రమేష్, యువకులను ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి అభినందించినారు

అప్ప కుంటకు గండి, పంట పొలాలకు భారీగా వరద నీరు

- లబోదిబోమంటున్న రైతులు
- అప్రమత్తమై ఇరిగేషన్ అధికారులు ప్రజాప్రతినిధులు
- గండి పూడ్చివేత, ఊపిరి పీల్చుకున్న రైతులు



నవతెలంగాణ-వెల్దుర్తి

గత నాలుగు రోజులు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో వరద నీటి ప్రవాహంతో కుంటలు చెరువులు జలమయమై వాటికి అనుసంధానంగా ఉన్న కాల్వలలోనికి పెద్ద ఎత్తున నీరు చేరుతుంది. ఇందులో భాగంగానే మండల పరిధి బండ పోసాన్ పల్లి పరిధిలోని అప్పకుంటకు గండిపడింది. దాంతో నీటితో పాటు పెద్ద ఎత్తున పొలాల్లోని మట్టి అంతా కొట్టుకపోయింది. ఒక్కసారిగా కట్ట పగిలిపోవడంతో నీరంతా పొలాల్లోనికి చేరిందని పంటను పూర్తిగా దెబ్బతినే దుస్థితి వచ్చిందని సీపీఎం మండల కార్యదర్శి గౌరీతో పాటు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా అప్పటికప్పుడు అప్రమత్తమై ఇరిగేషన్ అధికారులు తాజా మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డితో కలిసి జెసిపి సహాయంతో కట్టను పటిష్టపరిచే స్థాయిలో నిమగ్నమయ్యారు. అధికారులు స్పందించకపోతే వేసిన వరి నాట్లకు భారీగా వరద ప్రవాహం చేరి రైతులకు తీవ్ర నష్టం జరిగేదన్నారు. బషీర్ చెరువు రెండు తుముల వద్ద నుంచి నీళు లీకేజై భారీగా వెళ్ళిపోతున్నాయని గుర్తు చేశారు. వాటిని కూడా మరమ్మతులు చేయించి పటిష్ఠ పరచాలని ఆయకట్టు దారులు కోరారు. ఇదే తరహా మండల పరిధి ఏలకపల్లి గ్రామ శివారులో కాన్ చెరువు వద్ద కూడా బుంగ పడిందని ఇరిగేషన్ అధికారులకు సమాచారం చేరవేశారు. అలుగు కొట్టుకపోయి భారీగా నీళ్ల వృధాగా పోతున్నాయని వాటిని పటిష్ఠ పరచాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతులకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలి



నవతెలంగాణ-హవేలి ఘనపూర్

భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు రూ.50వేల నష్టపరిహారం ప్రభుత్వం తక్షణమే అందజేయాలని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కే.మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం బృందం మెదక్ జిల్లా ఆధ్వర్యంలో మండలంలోని చౌట్లపల్లి శివారులోని పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.మల్లేశం మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా అకాల వర్షానికి జిల్లాలో పంటలు నష్టపోయాయని చెరువులు కుంటలు గండ్లు పడ్డాయన్నారు. చెరువు, కుంటలు గండ్లు పడడానికి ఇరిగేషన్ అధికారులు కారణమన్నారు. గతంలో గ్రామంలో ఉన్న వీఆర్ఏలు వర్షాకాలం జూన్ మొదటి వారంలో చెరువులను కుంటలను తూములను పరిశీలించేవారన్నారు. ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకునేవారన్నారు. గత ప్రభుత్వం వీఆర్ఏ సంస్థ నుంచి వీఆర్ఏలను ఇతర శాఖలకు బదలాయించారు, ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం వల్ల హవేలి ఘనాపూర్ పెద్ద చెరువు, గంగాపూర్ శివారులోని బండకుంట, శమ్నా పూర్ శివారులోని జంగల్ లోద్దికుంట జిల్లాలో అనేక చిన్న చిన్న కుంటలు తెగి గండ్లు పడ్డాయన్నారు. అకాల వర్షం రావడంతో అనేక పంటలు మునిగి ఇసుక దిబ్బలు పెట్టాయని, ప్రభుత్వం వ్యవసాయ అధికారులు వెంటనే గ్రామాలలో నష్టపోయిన పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి రిపోర్టు పంపించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అనేక రోడ్లు వరదలకు కొట్టుకుపోయాయని, ఆర్ అండ్ బి అధికారులు రోడ్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. స్థానిక యువ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ నాలుగు రోజుల నుంచి అకాల వర్షం కురిసి నష్టపోయిన ఇప్పటివరకు ఎమ్మెల్యే నష్టాన్ని గురించి మాట్లాడటం లేదని గుర్తు చేశారు. కూలిపోయిన ఇండ్లకు రూ.10 వేలు, అకాల వర్షాల ప్రమాదాలకు గురై చనిపోయిన పశువులకు రూ.50 వేలు, గొర్రెలు, మేకలకు రూ.30 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సంతోష్, నాయకులు అజయ్, వెంకట్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.


బాధితులను పరామర్శించిన మైనంపల్లి హనుమంతరావు



నవతెలంగాణ-నిజాంపేట్

మండల వ్యాప్తంగా గత మూడు రోజులగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో కూలిన ఇంటి బాదితులను మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మేల్యే మైనంపల్లి హన్మంతరావు పరామర్శించారు. ఈ మేరకు నందిగామ, నార్లాపూర్ కల్వకుంట గ్రామాల్లోని పర్యాటించి భారీ వర్షాలకు కూలిన ఇంటి బాధిత కుటుంబాలను పరామర్శించారు. నందిగామ గ్రామంలో బ్రహ్మచారి ఇంటి వద్ద పుర వీధుల గుండా వచ్చే నీరు చెరువులకు వెళ్ళకుండా ఎన్‌హెచ్ 765 డిజి వలన ఇళ్ల మధ్యలోకి రావడాన్ని పరిశీలించారు. వెంటనే డీఈకి ఫోన్ మాట్లాడి గ్రామంలో ఎవ్వరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా కాల్వలు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం నార్లాపూర్ గ్రామంలో ఈ మధ్య కాలంలో మరణించిన బ్రహ్మం కుటుంబాన్ని పరామర్శించారు. కల్వకుంట గ్రామంలో భారీ వర్షాలకు కూలిన ఇంటి కుటుంబాన్ని పరామర్శించారు. మండలంలోని కాంగ్రెస్ యూత్ నాయకుడు రాంచందర్ నాయక్ స్వంత ఖర్చులతో కొనుగోలు చేసిన టార్పాలిన్ మాజీ ఎమ్మేల్యే హన్మంతరావు చేతుల మీదుగా వల్లపు మల్లేశం, కండ్లకోయ లక్ష్మి, గుర్రం శ్రీశైలం కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంజా మహేందర్ ఎం ఎస్ ఎస్ ఓ మండల ఇన్చార్జి వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, నసీరుద్దీన్ , రవీందర్ రెడ్డి, అమరసేనారెడ్డి, నర్సింహ్మారెడ్డి, ఆకుల బాలయ్య, భూమా గౌడ్, లక్ష్మణ్ గౌడ్, సులేమాన్ , మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కందకం కుంటను పరిశీలించిన తహసీల్దార్



నవతెలంగాణ- నార్సింగి

నాలుగు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు మండల వ్యాప్త చెరువులు నిండు కుండగా మారాయి. కొన్ని చెరువుల అలుగులు పారు తుండగా, కొన్ని పూర్తిగా నిండి కనులకు ఇంపుగా కనిపిస్తూ మండల రైతులలో సంతోషాన్ని నింపుతున్నాయి. మండల కేంద్రం లోని కందకం కుంట నిండింది. కుంటలోకి ప్రవహిస్తున్న నీటి వల్ల పూర్తిగా నిండి అలుగు పారితే, ప్రవహించే నీరు ఒకటవ వార్డులోని ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉన్నందున మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు అంచనూరి రాజేష్ స్థానిక తహశీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ షేక్ కరీం ఎంపిఓ షేక్ సయీద్, ఆర్ఐ నవీన్, జూనియర్ అసిస్టెంట్ భాను లతో పాటు కందకం పరిస్థితిని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కందకంలో నీరు చేరి పూర్తిగా నిండినదని, దీని అలుగు పారే కాలువలో చెత్త పేరుకుపోయిందని, ప్రస్తుతానికి నీరు జనావాసంలో వచ్చే పరిస్థితి ప్రస్తుతానికి లేదని, నీరు జనావాసాలలో రాకుండా సాధ్యమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాలువ శుభ్ర పరచడానికి ఇరిగేషన్ అధికారులకు సూచిస్తామని అన్నారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ల ఫోరం మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అంచనూరి రాజేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

చేరిలా అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసోత్సవం



నవతెలంగాణ-వెల్దుర్తి

ఐసీడీఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి ఆదేశాల మేరకు పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం చేరిలా అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి టీచర్ దేవలత లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రానికి వచ్చే పిల్లల తల్లిదండ్రులు గర్భిణీలు బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాలను గుడ్లు పాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఏఎన్ఎం అనిత మాట్లాడారు గర్భిణీలు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు ఎప్పటికప్పుడు చేయించుకోవాలని సూచించారు. బాలింతలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో తలెత్తే సీజన్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలన్నారు. పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరసరమన్నారు. వర్షాకాలంలో వేడి చేసిన నీళ్లను మాత్రమే తాగాలన్నారు. ఆహారాన్ని వేడిగా ఉన్నప్పుడే భుజించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా మంజుల గర్భిణీలు బాలింతలు పాల్గొన్నారు.

15వ వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ పరిశీలన



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో గౌరవ మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ముదిరాజ్ మంగళవారం ఉదయం కలియ తిరుగుతూ పరిశీలన చేశారు. గత నాలుగు రోజులుగా భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇండ్లను పరిశీలిస్తూ, ప్రజలతో ముచ్చటిస్తూ, ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉన్న శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉండకూడదన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్ల సమస్యపై స్పందించిన మున్సిపల్ చైర్ పర్సన్ జెసిబి సహాయంతో తీసివేయ వలసిందిగా మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ చైర్పర్సన్ ఆదేశాలతో మున్సిపల్ సిబ్బంది జెసిబి సాయంతో శిథిలావస్థలో ఉన్న ఇండ్లను తొలగించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఖాజా మోయిజుద్దిన్, 15వ వార్డ్ కౌన్సిలర్ శ్రీశైలం గౌడ్, మున్సిపల్ కమిషనర్ ఖాజా మోయునుద్దీన్, మున్సిపల్ మేనేజర్ రఘువరన్, కాంగ్రెస్ నాయకులు బొల్లు నాగులు, తిమ్మాపురం నర్సింలు, వార్డు ప్రజలు తదితరులు ఉన్నారు.

ఆసుపత్రికి వచ్చే పేషంట్లపై నిర్లక్ష్యం వద్దు




- తక్షణమే వైద్య పరీక్షలు అందించాలి
- గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ-గజ్వేల్

జ్వరంతో ఆసుపత్రులకు వచ్చే పేషెంట్లను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే రాపిడ్ టెస్ట్ చేసి డెంగ్యూ పరీక్ష నిర్వహించి ట్రీట్మెంట్ అందించాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఔట్ పేషెంట్ రిజిస్టర్, రక్త పరీక్షల ల్యాబ్, జర బాధితుల చికిత్స గది, మందులగది, డయాలసిస్, ఎస్ఎన్ సియు చిల్డ్రన్స్ వార్డులను తనికి చేసి రోగులకు అందుతున్న సేవలపై రోగులతో మాట్లాడి నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని త్వరలోనే వ్యాధులు నయమతయని తెలిపారు. మెడిసిన్ స్టోర్‌లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, 80 మంది డయాలసిస్ పేషెంట్లకు ప్రతిరోజు 5 సైకిల్స్ చొప్పున 40 మందికి డయాలసిస్ నిర్వహించాలని, ఎస్ఎన్‌సిఎల్ చిన్నపిల్లల వార్డులో అప్రమత్తంగా ఉండి నవజాత శిశువులకు ఇంక్యుబేటర్ సేవలు అందించాలని, ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ సాయి కిరణ్ ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట గజ్వేల్ ఆర్డీవో బన్సిలాల్, మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి, తహసీల్దార్, ఎంపీడీవో ఉన్నారు.

నవతెలంగాణ

సిద్దిపేట

4

బుధవారం | 04 సెప్టెంబర్ 2024 | www.navatelangana.com

ఖాలీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు



- గ్రామ పంచాయతీ ముందు నిరసన

నవతెలంగాణ-నంగునూరు

గత ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీళ్ల రాకపోవడంతో మహిళలు కాలి బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపిన సంఘటన సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. నల్ల పోచమ్మ దేవాలయం రోడ్డు గుట్ట మీది వాడ మహిళలు ఖాళీ బిందెలతో గ్రామపంచాయతీ వద్దకు వెళ్లి నిరసనకు దిగారు. ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీళ్ల రాకపోవడంతో కూలీ పనులు చేసుకునే తాము పనులకు ఎలా వెళ్లాలని, ప్రతి పనికి నీరు అవసరం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో నీళ్ళు రాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గుట్ట మీది వాడ వాసులకు వెంటనే బోర్ మరమ్మత్తులు చేసి అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు పట్టించుకోని ప్రతి రోజూ నీరు అందించేలా చూడాలని కోరారు. వాటర్ మెన్‌ను మార్చడం వల్ల త్రాగు నీటి కొరత తీవ్రంగా ఉందని మహిళలు వాపోయారు.

పౌష్టికాహారం ఆరోగ్యానికి మేలు



నవతెలంగాణ-నంగునూరు

గర్భవతులు, బాలింతలందరూ పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని సెంటర్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి. పద్మావతి సూచించారు. మంగళవారం నంగునూరు మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం-1లో పోషకాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ తోట పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భవతులు, బాలింతలు, తల్లులు తీసుకోవాల్సిన ఆహార అలవాట్లను అంగన్వాడీ టీచర్ తోట పద్మ అవగాహన కల్పించారు. ఆకు కూరలు, పాలు, గుడ్లు, క్యారెట్, బీట్ రూట్, బెల్లం, నిమ్మ, మునగ కాయలు తినాలని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్సీ సిస్టర్ జ్యోతి, గర్భవతులు, బాలింతలు, కిషోర బాలికలు ఆయా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన అధికారులు



నవతెలంగాణ-మద్దూరు

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల, మోడల్ స్కూల్ పాఠశాల, కాలేజీ హాస్టల్‌లను జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఆదేశాల మేరకు తహసీల్దార్ సంజీవ్ కుమార్, ఎంపీడవో రామ్మోహన్, డాక్టర్ రజిత, ఎంపీఓ వీరారాజులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని, వంటకు వాడే కూరగాయలను, పాఠశాల పరిసరాలను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్షాకాలం సందర్భంగా హాస్టల్లో వంటశాలలను, వాష్ రూమ్‌లను, డైనింగ్ హాల్ రూమ్‌లను, పరిశీలించినట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం ఏ విధంగా ఉందో పిల్లలను అడిగి వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. పాఠశాల చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్ఓను ఆదేశించినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల పిల్లలు జాగ్రత్తగా ఉండాలని, జ్వరం వచ్చిన వెంటనే వైద్య అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ స్వప్న, ఈసీ పరశురాం, పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

20 ఏళ్ల నుంచి మట్టి గణపతుల పంపిణీ



రామకోటి సంస్థ పంపిణీ చేయనున్న మట్టి గణపతులు

నవతెలంగాణ- గజ్వేల్

మట్టి గణపతులను వాడి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిది అని మంగళవారం గజ్వేల్‌లోని శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యకులు, భక్తిరత్న, కళారత్న, సేవారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గత 20 ఏళ్ల నుంచి మట్టి గణపతులను స్వయంగా తయారుచేసి భక్తులకు ఉచితంగా వినాయక చవితి రోజు అందిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం కూడా పర్యావరణాన్ని గురించి వివరించి, ప్రతి ఒక్కరికి మట్టి గణపతులను అందజేస్తున్నామన్నారు. ప్లాస్టరప్ ప్యారిస్‌తో తయారైన విగ్రహాల వల్ల రసాయనాలు వెలుబడి పర్యావరణాన్ని కీడు చేస్తాయని చెరువులో వేయడం వల్ల చేపలు, ఇతర జీవరాసులకు ముప్పు కలుగుతుందన్నారు. అందుకే మట్టి గణపతులే శ్రేయస్కరం అన్నారు. ఈ కార్యక్రమంలో రామకోటి ప్రతినిధులు పాల్గొన్నారు.

పంటల్లో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై అవగాహన



నవతెలంగాణ-జగదేవ్‌పూర్

జగదేవపూర్ మండలంలోని రైతు వేదిక తీగుల్ గ్రామంలో గల రైతు సోదరులకు ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ పంటలకు చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులను హైదరాబాదు నుంచి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్ బాబు, తెగుళ్ళ శాస్త్రవేత్త, డాక్టర్ గోపాల వర్మ , కీటక శాస్త్రవేత్త శ్రవణ కాన్ఫిరెన్స్ ద్వారా రైతు సోదరులకు అవగాహన కల్పించారు. అలాగే రైతులు అడిగిన పలు సందేహాలకు సమాధానాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గద్దర్ అవార్డు అందుకున్న పిన్నింటి రత్నం



నవతెలంగాణ-కొమురవెల్లి

భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గిద్దే గళం సంస్థ ఆధ్వర్యంలో గిద్దె రాంనర్సయ్య మహబూబాద్ జిల్లా తొర్రూర్ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజా యుద్ధ నౌక గద్దర్ అవార్డును సాంస్కృతిక కళా సారథి పిన్నింటి రత్నం అందుకున్నారు. ఈ సందర్భంగా కళాకారుడు పిన్నింటి రత్నం మాట్లాడుతూ ఒక సామాజిక వేత్త, విప్లవకారుడు, ప్రజా యుద్ధ నౌక ప్రజాగాయకుడు దివంగత గద్దర్ అన్న అవార్డు రావడం జీవితంలో మరుపురానిదని అన్నారు. రాష్ట్రం నుంచి ప్రతిభావంతులైన కవులను కళాకారులను ఉద్యమ ప్రముఖులను గుర్తించి గిద్దె గళం సంస్థ గద్దర్ అవార్డుల కార్యక్రమంలో ఉమ్మడి చేర్యాల నుంచి గద్దర్ అవార్డుకు ఎంపిక చేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ అవార్డు రావడంపట్ల సారథి కళాకారుల జిల్లా అధ్యక్షులు కళాంజలి రాజేష్, శృతి జానపద కళాసమితి అధ్యక్షులు పిన్నింటి దాసు, శ్యామ్ , పన్నీరు శ్రీనివాస్, కవులు కళాకారులు తదితరులు హర్షం వ్యక్తం చేశారని చెప్పారు

చెరువును తలపిస్తున్న కస్తూర్బా పాఠశాల



నవతెలంగాణ-మర్కుక్

మండల కేంద్రమైన మర్కుక్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల చెరువును తలపిస్తోంది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాల మైదానం పూర్తిగా వర్షపు నీటితో నిండి మెయిన్ రోడ్డు పైకి చేరుకొని పిల్లలు బడిలోకి రావడానికి సరైన దారి లేక నిండిన మైదానం చెరువును తలపిస్తూ విద్యార్థులకు ఇబ్బందిగా తయారైంది. పాఠశాల సమీపంలో కాలి స్థలం ఎక్కువగా ఉండటంతో వర్షపు నీటికి విష పురుగులు సంచరించే అవకాశం ఉందని తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. నీటి నిల్వ ఇలాగే కొనసాగితే బాలికలు కస్తూర్బా పాఠశాలలో ఉండేందుకు భయపడుతున్నారని ఇలాగైతే పిల్లల చదువు ఎలా అని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై స్థానిక ఎంఈవో ఉదయ బాస్కర్ రెడ్డిని వివరణ కోరగా పాఠశాలలో ఇప్పటికే అమ్మ బడి కార్యక్రమంలో మెంటనెన్స్ పనులు చేయడం జరిగిందని, వర్షపు నీరు వెళ్ళడానికి శాశ్వత ప్రతి ప్రాతిపదికన పనులు చేపడతామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో నీరు మొత్తం పాఠశాలలో చేరిందని, దీంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు తల్లిదండ్రులు వాపోయారు. అధికారులు స్పందించాలని వారు కోరారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్‌లు ప్రారంభం

నవతెలంగాణ-కొండపాక

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదవ తరగతి ఇంటర్మీడియట్ చదువుకునే వారికి 2024 - 2025 సంవత్సరానికి గాను అడ్మిషన్స్ ప్రారంభమయ్యాయని దుద్దెడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ఎం.లక్ష్మి తెలిపారు. ఇంటర్, 10వ తరగతి లో అడ్మిషన్ పొందగోరే విద్యార్థులు ఈ నెల 20 వరకు , అపరాధ రుసుముతో అక్టోబర్ 3 వరకు దరకాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఆశ వర్కర్లను పర్మినెంట్ చేయాలి

- ఆశాలను పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాల స్వామి



నవతెలంగాణ-సిద్దిపటరూరల్

ఆశ వర్కర్లను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాల స్వామి అన్నారు. మంగళవారం సిద్దిపేట రూరల్ నారాయణరావుపేట మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఆశాలు పది లక్షల మంది పని చేస్తున్నారు. వారు గత 30 ఏళ్ల నుంచి కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్, గత 20 ఏళ్ల నుంచి ఆశాలు ఎన్‌హెచ్ యం స్కీంలో భాగంగా పనిచేస్తున్నారు. నిరంతరం పేద ప్రజలకు ఆరోగ్య సేవలిందిస్తున్నారు. కరోనా లాంటి మహమ్మారి కాలంలో కూడా ముందు వరుసలో ఉండి ప్రజలకు సేవలందించారు. డబ్ల్యుహెచ్ఓ అంతర్జాతీయ సంస్థ ఆశా వర్కర్లకు గ్లోబెల్ హెల్త్ లీడర్స్ అవార్డును కూడా అందించింది. ఇప్పుడు ప్రజలకు వస్తున్న సీజనల్ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి అరికట్టడంలో, ఆస్పత్రుల్లో డెలివరీల సంఖ్యను పెంచడంలో ఆశాలు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇన్ని పనులు నిర్వహిస్తున్న ఆశాలను కేంద్ర ప్రభుత్వం నేటికీ గుర్తించడం లేదు. 45వ, 46వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసుల ప్రకారం ఆశాలను కార్మికులుగా గుర్తించాలి. కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సామాజిక భద్రత తదితర సౌకర్యాలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడం దేశానికే అవమానకరం. గతంతో పోల్చినప్పుడు ఈ కాలంలో ఆశాలకు రోజు రోజుకు పనిభారం మరింత పెరుగుతుంది. రోజుకు 12 నుంచి16 గంటలు పని చేయవలసి వస్తుంది. ఆదివారం, పండుగలు, అనారోగ్యానికి గురైనప్పుడు కూడా ఆశాలకు సెలవులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితులు ఆశాల ఆరోగ్యం పైన తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నాయని. ఆశాల ఆరోగ్యం దెబ్బతిని చివరికి ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య ఈ కాలంలో పెరుగుతున్నదని వీటితో పాటు దేశంలోని ప్రజారోగ్య సౌకర్యాల విషయంలో ఆందోళనకరమైన పరిస్థితి ఉందని. డాక్టర్లు, నర్సులే కాదు, ఆశా వర్కర్లు కూడా తరచూ లైంగిక వేధింపులకు, దాడులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే జోక్యం చేసుకుని అత్యవసర డిమాండ్లను వీలైనంత త్వరగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే కాలంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి తునికి మహేష్, ఆశ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు రెడ్డమైన బలమని, ఆశ వర్కర్లు శ్రీలత, సావిత్రి, భవాని, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో శాంపిల్స్ సేకరించిన విజిలెన్స్ అధికారులు

- గజ్వేల్‌లో షాప్ తనిఖీ.
- బియ్యం శాంపిల్స్ సేకరణ
- రాష్ట్ర సివిల్ సప్లై ఓఎస్‌డీ ద్రోణాచార్య



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

రాష్ట్రంలోని రేషన్ షాపుల్లో నాణ్యత గల బియ్యం వస్తున్నాయా లేదా అని సివిల్ సప్లై కమిషనర్ చౌహన్ ఆదేశానుసారం షాపుల తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర సివిల్ సప్లై ఓఎస్‌డీ ద్రోణాచార్య అన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణ కేంద్రంలో రేషన్ షాపులు తనిఖీ చేశారు. అనంతరం షాప్‌లో ఉన్న బియ్యాన్ని శాంపిల్ సేకరించారు. ఈ సందర్భంగా ఓ ఎస్ డి ద్రోణచార్య మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదలకు సరఫరా చేసే రేషన్ బియ్యం నాణ్యతగా వస్తున్నాయా లేదా అని పరిశీలించామన్నారు. షాపులో ఉన్న బియ్యాన్ని సేకరించి ల్యాబ్ పంపుతామన్నారు. నిరుపేదలకు అందించే రేషన్ బియ్యం రీసైకిలింగ్ చేసిన వేరే వారికి అమ్మిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం అందించిన బియ్యాన్ని తీసుకోవాలని, బ్లాక్ మార్కెటింగ్ తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం నాణ్యమైన బియ్యాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లై అధికారి ఎస్పీ భూషణ్, ఎస్. ప్రభాకర్, సాంబశివరావు, వెంకటేశ్వర్లు, ఎస్సై వెంకట్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ కృష్ణ, రేషన్ డీలర్ల నియోజకవర్గ అధ్యక్షులు అజీజ్, ప్రధాన కార్యదర్శి రమేష్,డీలర్ వజీర్ ఖాన్,తదితరులు ఉన్నారు

శిథిలావస్థలో యూసుఫ్ ఖాన్‌పల్లి పాఠశాల




నవతెలంగాణ-మర్కుక్

నిరుపేద విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలనే ప్రభుత్వ లక్ష్యంతో గ్రామాల్లో పక్కా భవనాలు ఏర్పాటు చేసి వారికి విద్యను అందిస్తున్న ప్రభుత్వ ఆశయం గొప్పదే అయినప్పటికీ పాలకుల నిర్లక్ష్యమో, అధికారుల పర్యవేక్షణ లోపమో తెలియదు కానీ ఆ భవనాలు సమస్యలకు నిలయంగా మారాయి. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న యూసుఫ్ ఖాన్ పల్లి గ్రామంలో సుమారు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఈ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 13 మంది విద్యార్థులు చదువుతుండగా ఒకే గది విద్యను అభ్యసిస్తూ వరండాలో మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. వరండా, తరగతిగది శ్లాబ్‌లో పెచ్చులూడి పడిపోతున్నాయి. ఏ సమయంలో ఎక్కడ పెచ్చులు మీదపడతాయోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గత నాలుగు రోజులుగా వర్షాలు కురయడంతో శ్లాబ్ నుంచి నీరు కారుతూ తరగతి గదుల్లో నీళ్లు నిల్వ ఉండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా 'నవతెలంగాణ'తో గ్రామస్తులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం గురించి ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించామని, అయినా ఫలితం లేదని అన్నారు. దీంతో విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వంలో హయాంలోనైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించి నూతన భవనాన్ని నిర్మించాలని కోరుతున్నామన్నారు.

ఇదిలా ఉండగా మండలంలోని పాతూరు, పాములపర్తి హరిజన వాడ పాఠశాలలు పూర్తిగా శిథిలావస్థలోకి చేరాయి. యూసుఫ్ ఖాన్ పల్లి పాఠశాల మరమ్మత్తుల అమ్మ అదర్శ పాఠశాల నిధుల నుంచి రూ.3 లక్షలు మంజూరైయ్యాయి. ఇప్పటి వరకు మరుదొడ్లు, నాళ్ళల పీట్టింగ్, సంపు, శ్లాబ్ నిర్మాణం చేపట్టారు. కానీ శ్లాబ్ వేసి నెలరోజుల గడవకముందే వర్షాలకు కురవడంతో ఎక్కడవేసిన గొంగలి అక్కడే చందంగా మారింది. దీంతో శ్లాబ్ నిర్మించిన డబ్బులు బుడిదిలో పన్నీరులా మారిందని ప్రజలు ఆరోపించారు. పనుల్లో అధికారుల పర్యవేక్షణ లోపంతో నాణ్యత లేకుండా పోయిందని, దీంతో భవనము ఊరుస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. ఈ విషయమై నవతెలంగాణ విలేకరి, ఏఈ రాజేశ్ రెడ్డిని వివరణ కోరాగా అమ్మ అదర్శ పాఠశాల పనుల్లో నాణ్యత ప్రమాణాల పాటిస్తున్నామని, శ్లాబ్ నెల రోజుల కింద వేసిన మాట వాస్తవే, భవనము ఊరుస్తున్న మాట వాస్తవే, నూతన భవనము కోసం పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పది రోజుల్లో జిల్లాలోని అన్ని పాఠశాలలను సందర్శిస్తాం

- జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్





నవతెలంగాణ-కొండపాక

వచ్చే పది రోజుల్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లను సందర్శిస్తామని జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమ అగర్వాల్ తెలిపారు. మంగళవారం రోజున కొండపాక మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని, వంట గదిని, వంట సామాగ్రిని పరిశీలించి మెనూ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటించి పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. విద్యారులు పాఠశాలలో కోతుల బెడద, పాములు గదలలోకి వస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా స్నానాలకు వేడి నీరు అందించే విధంగా చూడాలన్నారు. పాఠశాలలో వాలీబాల్ తదితర ఆట వస్తువులు లేవని అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.అడిషనల్ కలెక్టర్ వాలీబాల్ కిట్ పంపిస్తానని హామీ ఇచ్చారు. అడిషనల్ కలెక్టర్ సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పదవ తరగతి విద్యార్థులు 10/10 సాధించాలన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అన్ని పాఠశాలలను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి , కొండపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు డాక్టర్ శ్రీధర్, కొండపాక తహసీల్దార్ దిలీప్ నాయక్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఓగౌతమి పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

మతసామరస్యం ఫరిడవిల్లేలా ఉత్సవాలు నిర్వహించుకోవాలి

- సీఐ శ్రీనివాస్



నవతెలంగాణ-దుబ్బాక

వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో మతసామరస్యం ఫరిడవిళ్లేలా నిర్వహించుకోవాలని దుబ్బాక సీఐ పీ.శ్రీనివాస్ సూచించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని పద్మశాలి భవన్ లో 'శాంతి పరిరక్షణ కమిటీ సమావేశాన్ని ' పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్తు, అగ్నిమాపక శాఖలు సంయుక్తంగా నిర్వహించాయి. అనంతరం సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ వెంకటరెడ్డి, విద్యుత్తు ఏఈ రామాంజనేయులు, ఎస్ఐ వీ.గంగరాజు మాట్లాడారు. వినాయక మండప నిర్వాహకులు ఆఫ్ లైన్‌లో విధిగా దరఖాస్తు చేసుకొని ఆ దరఖాస్తును దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో అందించాలన్నారు. ప్రతి మండపం దగ్గర రెండు ఇసుక బకెట్లు, ఒక డ్రమ్మునిండా నీరు నింపి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. డీజే బాక్స్‌లకు అనుమతి లేదన్నారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకొని భక్తి ప్రవత్తులతో ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్తు కనెక్షన్ విషయంలో జాగ్రత్తలు వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ ఆఫీసర్ కమలాకర్, వర్క్ ఇన్స్పెక్టర్ బుస్స ప్రవీణ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నరేదర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఆసిఫ్, పద్మశాలి సమాజం అధ్యక్షుడు గాజుల తిరుపతి, మజీద్ కమిటీ అధ్యక్షుడు ఖలీల్, గణేష్ ఉత్సవ కమిటీ మండపాల నిర్వాహకులు, యువకులు, ముస్లిం మత పెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ర్యాగట్ల చందు



నవతెలంగాణ-మిరుదొడ్డి

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ర్యాగట్ల చందు అన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో ఉన్నటువంటి వివిధ గ్రామాల ప్రజలు భారీ వర్షాల సమయంలో ప్రతి ఒక్కరు వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలని అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లాలని అన్నారు. గత మూడు, నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయని మరో రెండు, మూడు రోజులు వర్షాలు ఉన్నాయనీ వాతావరణ శాఖ తెలిజేసిందన్నారు. వర్షాల వల్ల తడిసిన కరెంటు స్తంభాలు, విద్యుత్ తీగలు, ఇనుప స్తంభాలను తాకకుండా జాగ్రత్తగా ఉండాలని, ఇంట్లో విద్యుత్ పరికరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులను బయటకు రాకుండా చూడాలని తెలిపారు. ఉధృతంగా ప్రవశిస్తున్న కాలువలు, చెరువులు, వాగులు వద్దకు వెళ్ళకుండా ఉండా లని, శిథిలావస్థలో ఉన్న ఇల్లాల్లో ఉన్న ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యవసరమైతే 100 కాల్ చేయాలని అలాగే వరద బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సూచారు. ఈ వర్షాల వలన నష్టపోయిన వారికి నష్టపరిహారం, ఇండ్లు కూలిపోయిన వాళ్లకు ప్రభుత్వమే వారికి నష్టపరిహారం కింద ఇండ్లను కూడా పంపిణీ చేయాలని అన్నారు

నిండుకుండలా చెరువులు, కుంటలు... కానరాని హెచ్చరిక బోర్డులు

- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలం




నవతెలంగాణ-మద్దూరు

గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మద్దూరు మండలంలో 40 కుంటలు, 14 చెరువులు, దూళ్మిట్ట మండలంలో 28 కుంటలు, 9 చెరువులు, నిండి నిండుకుండలను తలపిస్తున్నాయి. చెరువుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంలో, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. చెరువులు, కుంటలు నిండుకుండల నిండి ఉండడంతో చెరువుల వద్దకు వెళ్లే ప్రజలు ఆ లోతు తెలవకుండా చెరువులోకి దిగే ప్రమాదం ఉంది. గ్రామాల్లో ఏ పనులు జరిగినా ఇండ్లకు, రోడ్లకు, చెరువుల నుంచి ఇష్టానుసారంగా కాంట్రాక్టర్లు చెరువులో నుంచి మట్టి తరలించడంతో, చెరువులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలంలో నీరు చెరువులోకి వచ్చి చేరడంతో పెద్ద పెద్ద గుంతలు కనిపించవని ఇది తెలవక ఎంతోమంది ప్రజలు చెరువులోకి దిగి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అధికారులు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే చెరువుల్లో దిగే ప్రజలు అప్రమత్తంగా ఉంటారని మండల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి నిండుకుండలా నిండిన చెరువులు, కుంటల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పుస్తకం చదవడం అలవాటుగా మార్చుకోవాలి

- అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ భాస్కర్




నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

పుస్తకం చదవడం విద్యార్థులు అలవాటుగా మార్చుకోవాలని అకాడమీ మానిటరింగ్ అధికారి భాస్కర్ అన్నారు. రూమ్ టు రీడ్ లో భాగంగా మంగళవారం సిదిపేట రూరల్ మండల పరిధిలోని ఇర్కోడు మోడల్ స్కూల్లో రీడ్ ఎ థాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదవడం అలవాటుగా చేసుకోవడం విద్యార్థికి ఎంతో అవసరమని తెలిపారు. ప్రతిరోజు మనము రాత్రి పడుకునే ముందు ఏదైనా ఒక నవల కాని కథ గాని మనకు నచ్చినటువంటి పుస్తకాన్ని చదవడం అలవాటు చేసుకోవాలని తద్వారా మనకు ఒక అలవాటుగా మారి మనకు జ్ఞానాన్ని అందించే విధంగా ఉంటుందని తెలిపారు. పఠనం విద్యార్థికి ఉండాల్సిన ముఖ్య లక్షణమని తెలిపారు. భాష నైపుణ్యాలలో భాగంగా చదవడం అనేది చాలా అవసరమని మనలోని భావనలను తెలపడానికి కొంత పద జ్ఞానం అవసరం కాబట్టి ఆ పద జ్ఞానం చదవడం వల్ల వస్తుందని తెలిపారు. భారతదేశంలో యువత నేటి బాలలే రేపటి పౌరులు అనేటువంటి నినాదాన్ని తీసుకొని పఠనాభివృద్ధిని అలవాటు చేసుకున్నట్లయితే ప్రపంచ విషయాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు .కాబట్టి ఒక విద్యార్థిగా ప్రతిరోజు ఒక గంట పాటు చదవడం ప్రారంభించాలని, అది అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సామలేటి బుచ్చిబాబు , రూమ్ టు రీడ్ కోఆర్డినేటర్ రవి , ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత



నవతెలంగాణ-కొండపాక

మండల పరిధిలోని ఖమ్మంపల్లి గ్రామంలో పనిచేస్తున్న ఒరిస్సాకు చెందిన కూలీలకు మంగళవారం రోజున సేవ్ ఎర్త్ సేవ్ లైఫ్ ఫౌండేషన్ ఫౌండర్ యాదగిరి నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడ తెరిపి లేకుండా వర్షాలు పడుతున్న దృశ్య వారికీ బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం ఎంతో తృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో మంతురి జగదీశ్వర్, నూనె నగేష్, రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు

పందిల్ల రహదారి బ్రిడ్జిని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు హుస్నాబాద్ సిద్దిపేట ప్రధాన రహదారి పందిల్ల బ్రిడ్జిని, మత్తడి పడుతున్న హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువును మంగళవారం హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ వచ్చే వర్షాకాలం వరకు హుస్నాబాద్ పట్టణంలో వరద నీటి ముంపు లేకుండా చేస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇవ్వడం మంచి పరిణామమన్నారు. వచ్చే వర్షాకాలం వరకు హుస్నాబాద్ పట్టణంలో వరదనీటి ముంపు సమస్యను పరిష్కరించకుంటే మంత్రి కార్యాలయం ముందు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తామే ముందు ధర్నా చేస్తామని పేర్కొన్నారు. వరద ముంపు ఉన్న ప్రాంతాల్లో వెంటనే ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత, మున్సిపల్ మాజీ చైర్మెన్ సుద్దాల చంద్రయ్య, వైస్ చైర్మెన్ అనిత రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్వర్, కౌన్సిలర్లు బొజ్జా హరీష్, బీఆర్ఎస్ నాయకులు ఐలేని మల్లికార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుంటలు చెరువులను సందర్శించిన గజ్వేల్ సీఐ

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అధికారుల సలహాలు సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ సీఐ బి సైదా అన్నారు. మంగళవారం గజ్వేల్ మండలంలోని జాలిగామ, కోమటి బండ, రిమ్మనగూడ,కొనాపూర్ చెరువులు పొంగిపొర్లుతున్న పరిస్థితి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీఐ సైదా మాట్లాడుతూ గత నాలుగు ఐదు రోజుల నుంచి మండలంలో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో పర్యటించామన్నారు. గ్రామాల మధ్య గల ప్రధాన రహదారి , కుంటలు చెరువులు వాగులు తెగిపోవడం వల్ల ప్రమాదం జరగకుండా ముందుగా జాగ్రత్తలు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించి చుట్టుపక్కల ఇరు గ్రామాల వారు ఎవరు అటువైపు రావద్దని తెలిపామన్నారు. కుంటలు చెరువులను నిండడం వల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని గ్రామ ప్రజలకు తెలియజేశమన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, రెవెన్యూ ఆఫీసర్లు, పాల్గొన్నారు.

అక్కన్నపేట ఖుషి వైన్స్‌లో కల్తీ మద్యం కథనానికి స్పందన.


నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండల కేంద్రంలోని ఖుషి వైన్స్‌లో కల్తీ మధ్య అమ్ముతున్నారని నవ తెలంగాణ కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించారు. మంగళవారం ఖుషి వైన్స్‌కు ఎక్సైజ్ ఎస్సై రూప వచ్చి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైన్స్ లో మద్యం చెక్ చేశామని, అందులో కల్తీ జరిగినట్టు ఏమి తెలియలేదని ఆమె అన్నారు. అంతేకాకుండా అధిక ధరలకు బెల్ట్ షాపులకు మధ్య అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా టీపీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక


నవతెలంగాణ-తొగుట



టీపీటీఎఫ్ మండల శాఖ ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించామని అధ్యక్షుడు బి. రాములు తెలి పారు. మంగళవారం టిపిటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు బి. రాములు, ప్రధాన కార్యదర్శిగా అంకం బాల్ రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడు బి. రాములు మాట్లా డుతూ ఉపాధ్యాయులకు నేటి వరకు ఉపాధ్యా యులకు రావలసిన 4 డిఏలు పెండింగులో ఉన్నాయని ప్రభుత్వం డిఏలు ఇవ్వాలని కోరారు. దేశంలో కొన్ని రాష్ట్రాలలో సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ విధానం కొనగుతుందని అన్నారు. రాష్ట్రం ఓపిఎస్ విధానాన్ని ప్రవేశ పెట్టాలన్నారు.ఎన్నికల సమయంలో ప్రభుత్వం సీపీఎస్ ను రద్దు చేస్తామని మ్యానిఫెస్టోలో తెలిపిందని గుర్తు చేశారు. వారు ఇచ్చిన మాటను నిలబెట్టు కోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా విష్ణువర్ధన్ రెడ్డి, విజ యేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కే తిరుపతి, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు జి తిరుపతిరెడ్డి, ఎం. మోహన్, ఎస్. శ్రీనివాస్, పి. విశ్వరూప చారి, అమ రేందర్ రెడ్డి, టి. రవి కిరణ, వెంకటనరసింహులు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఇంటర్ స్పాట్ అడ్మిషన్‌లకు ధరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కోహెడ



మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఇంటర్మీడియట్ బైపీసీ ప్రథమ సంవత్సరానికి 5 సీట్లకు గాను స్పాట్ అడ్మిషన్‌లు కలవని ప్రిన్సిపాల్ జీ.వెంకట్రామిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ కేటగిరిలో విద్యార్థులు ఈ నెల 5వ తేదిన స్పాట్ అడ్మిషన్ కౌన్సిలింగ్‌కు కళాశాలలో హాజరు కావాలన్నారు. అర్హులైన విద్యార్థులు సర్టిఫికెట్‌లతో హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జాన్ వెస్లీ మరణం సమాజానికి తీరని లోటు




నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

జాన్ వెస్లీ మరణం సమాజానికి తీరని లోటు అని మాదిగల సమన్వయ కమిటీ సభ్యులు అన్నారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రావురుకుల గ్రామంలో జాన్ వెస్లీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జాన్ వెస్లీ ఉపాధ్యాయులగా చేరి నిత్యం ప్రజల సమస్యలపై సామాజిక ఉద్యమాల్లో ముందుండేవారని కొనియాడారు. బెల్లె రాములు, ముత్యాల కనకయ్య, సలిమెల కనకయ్య, భోగి రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.


బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

నవతెలంగాణ-జగదేవపూర్



జగదేవ్‌పూర్ పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రానికి చెందిన రాగుల కనకయ్య, పీ నర్సింలు అనారోగ్యం కారణంగా హాస్పిటల్ చేరాగా అధిక మొత్తంలో హాస్పిటల్‌లో డబ్బులు ఖర్చు కాగా మండల బీఆర్ఎస్ పార్టీ నాయకుల దృష్టికి తీసుకు వెళ్లగా వెంటనే స్పందించి మాజీ మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, రాష్ట మాజీ ఎఫ్‌డీసీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ కు దరకాస్తూ చేసుకోగా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రాగుల కనకయ్యకు రూ. 60వేలు,పీ.నర్సింలుకు రూ.43,500 చెక్కులను అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బుద్ధ నాగరాజు, మాజీ ఎంపీటీసీ కవిత శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు దాచారం కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి



నవతెలంగాణ-వర్గల్

ప్రజలు పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని వర్గల్ ఎస్సై కరుణాకర్రెడ్డి అన్నారు. మంగళవారం వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో ఉత్స వాలను నిర్వహించుకోవాలన్నారు. వినాయక మండపాల వద్ద డీజేలకు అనుమతిలేదని స్పష్టం చేశారు. గ్రామాల్లో ప్రజలు ఐక్యంగా ఉండి వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఇందుకు అందరూ పూర్తి సహకరం అందించాలని అన్నారు. నిమజ్జనం రోజున చెరువుల వద్ద ఉత్సవ కమిటీ నిర్వా హకులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరు విధిగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-మద్దూరు



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో రామ్మోహన్ అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని రేబర్తి గ్రామాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు బురదగా ఉన్న ప్రాంతంలో ఆయిల్ బాల్స్ వేయించినట్లు తెలిపారు. దోమల నివారణకు మలాతీయాన్ మందు నాలిల మందు పిచికారి చేయించినట్లు తెలిపారు. డ్రై డే యాక్టివిటీస్ చెయ్యడం, బురదగా ఉన్న ప్రాంతములో బ్లీచింగ్ పౌడర్ చల్లడం జరిగిందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు సరైన పోషణకరమైన ఆహారాలు అందజేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్ స్టువర్ట్ సన్, పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్, ఫీల్డ్ అసిస్టెంట్ ఐల్లయ్య ,అంగన్వాడీ కార్యకర్త జ్యోతి ,ఆశ కార్యకర్త కవిత తదితరులు పాల్గొన్నారు

వర్షాల నుంచి పంటల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి



- గజ్వేల్ ఏడిఏ బాబు నాయక్

నవతెలంగాణ-గజ్వేల్

ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాల నుంచి పంటలను సంరక్షణకు చర్యలు చేపట్టాలని గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్ తెలిపారు. మంగళవారం గజ్వేల్ మండలం అమ్మదిపూర్, రాగట్లపల్లి, దిలాల్పూర్ తదితర గ్రామాల్లో ఏఈఓలతో కలిసి ఆయన పంట పొలాలు, పత్తి ఇతర పంటలను ఆయన పరిశీలించారు. పంటల సంరక్షణకు యజమాన్య పద్ధతులు పాటించవలసిన అవసరం ఉందన్నారు. రైతులు తక్షణమే పొలం నుంచి నీటిని తొలగించాలని మరో రెండు మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతులకు వివరించారు. పంట పొలాల్లో మందులను పిచికారి చేయడం వాయిదా వేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఆకు తెగులు వచ్చే అవకాశం ఉంటుందని రైతులకు వివరించారు. పత్తి, మొక్కజొన్న, వరి పంటలకు కావాల్సిన అవగాహన సదస్సును రైతులకు వివరించినట్లు ఆయన తెలిపారు. మొక్కజొన్న పంటలో అధిక వర్షాల వల్ల నేలలో బాస్వరం లోపం ఏర్పాటు మొక్కలను ఉదా రంగులోకి మార్చే అవకాశం ఉంటుందన్నారు. పంటలు సంరక్షించుకొని చర్యలు చేపట్టుకోవాలని కావాల్సిన సూచనలు, సలహాలు ఇస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు నర్సింలు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలకు మంజూరైన కోర్టును వెంటనే ప్రారంభించాలి

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి, ఎమ్మెల్యే పల్లా వెంటనే చొరవ తీసుకోవాలి
- చేర్యాల ప్రాంతంపై పాలకుల నిర్లక్ష్యం వీడాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి
- కోర్టును ప్రారంభించాలని సీపీఐ(ఎం)ఆధ్వర్యంలో పాదయాత్ర






నవతెలంగాణ-చేర్యాల

చేర్యాలకు మంజూరైన కోర్టును వెంటనే ప్రారంభించాలని అందుకు అధికార కాంగ్రెస్ పార్టీ జనగామ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి వెంటనే చొరవ తీసుకోవాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. మంజూరైన కోర్టును వెంటనే ప్రారంభించాలని సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం చేర్యాల మండల కేంద్రంలోని గాంధీ సెంటర్ నుంచి కోర్టు కోసం కేటాయించిన మండల ప్రజా పరిషత్ కార్యాలయం వరకు సుమారు రెండు కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ చేర్యాల ప్రాంతంలో వేల సంఖ్యలో కోర్టు కేసులు ఉన్నాయని, వీటి పరిష్కారానికి చేర్యాల పట్టణ కేంద్రంలో కోర్టును ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం), జేఏసీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించి సాధించుకున్న కోర్టును రెండు సంవత్సరాలు గడుస్తు న్నప్పటికీ ప్రారంభి ంచడం లేదన్నారు. సంబంధిత అధికారులు, అధికార కాంగ్రెస్ పార్టీ నియోజ కవర్గ ఇన్చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిలు వెంటనే చొరవ తీసుకొని చేర్యాలలో కోర్టును ప్రారం భించాలన్నారు. చేర్యాల ప్రాంతంలోని నాలుగు మండలాలకు సంబంధించి 53 గ్రామాల ప్రజలు మద్దూరు, దూళ్మి ట్ట నుంచి హుస్నాబాద్ కోర్టుకు, చేర్యాల కొమురవెల్లి మండలాలతోపాటు చేర్యాల పట్టణం నుంచి సిద్దిపేట కోర్టులకు వాది, ప్రతివాదులు, సాక్షిదారులు వీరి వెంట బంధువులు, స్నేహితులు, కోర్టులో వాదించే అడ్వకేట్లు ప్రతిరోజు వంద లాది మంది ప్రస్తుతం సిద్దిపేట, హుస్నాబాద్ కోర్టులకు వెళుతూ అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ప్రాంతం నుంచి వేల సంఖ్యలో కేసులు ఉండడంతో చేర్యాలలో ప్రత్యేక కోర్టు ఏర్పాటుకై అనేక సంవత్సరాల నుంచి పోరాడుతున్నప్పటికీ గత రెండు సంవత్సరాల క్రితం ఈ కోర్టును ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ ప్రారంభించడంలో కాలయాపన చేస్తున్నారని కోర్టును ప్రారంభించేందుకు కాంగ్రెస్ పాలక పార్టీ ప్రతినిధికి కోర్టు సమస్య పట్టదా అని, ఎమ్మెల్యేకు చేర్యాల కోర్టును పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. కోర్టు సంబంధిత అధికారులు ఇప్పటికైనా చేర్యాల ప్రాంత కోర్టు సమస్యను పరిష్కరించి ప్రారంభించాలని కోరారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు ఈ ప్రాంత సమస్యలపై, కోర్టు, రెవెన్యూ డివిజన్ విషయం, ఈ ప్రాంత అభివృద్ధి విషయంలో అనేక పోరాటాలు నిర్వహించినప్పటికీ ఈ ప్రాంత ప్రజల పోరాటం చరిత్రనే మిగులుతుంది కాని ఏ ఒక్క సమస్య పరిష్కారం చేయకుండా ఇక్కడి ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. మభ్యపెట్టి కాలం వెళ్ళబుచ్చుకోవడం సరైంది కాదన్నారు. చేర్యాల ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొమ్మూరి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిల పట్ల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, నిర్లక్ష్యం వహిస్తే వీరిపై తిరుగుబాటు పోరాటాలు తప్పవని, ఇప్పటికైనా చేర్యాల ప్రాంత ప్రజల సౌకర్యార్థం వెంటనే కోర్టును ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో సీపీఐ(ఎం)పార్టీ ఆధ్వర్యంలో 4 మండలాల ప్రజలను ఏకం చేసి పోరాటాన్ని బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు, మద్దూరు మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి, దూళ్మిట్ట మండల బాధ్యులు చొప్పరి రవికుమార్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండ కింది అరుణ్ కుమార్, రామ్ సాగర్ మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, అత్తిని శారద, దాసరి ప్రశాంత్, పోలోజు శ్రీహరి, ఆముదాల నర్సిరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదవాలి

- కార్పొరేట్ దీటుగా గురుకుల పాఠశాలలో విద్యాబోధన
- సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి





నవతెలంగాణ-రాయపోల్

విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గురుకులాల్లో విద్యాబోధన అందించడం జరుగుతుందని గురుకులాల్లో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండలం లింగరాజు పల్లి మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తుందని విద్యార్థులు మంచి అవకాశాన్ని వినియోగించుకొని చదువులో జిల్లా ముందుండాలని అన్నారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వారి నుంచి అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ హాల్ పూర్తిగా శిధిలావస్థకు చేరిందని కొత్త భవనం కావాలని చెప్పడంతో వెంటనే ప్రతిపాదన సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే లైబ్రరీ ఇన్చార్జితో పాటు క్రీడా సామాగ్రి కావాలని విద్యార్థులు విన్నవించారు. కలెక్టర్ స్పందిస్తూ ఏర్పాటు చేస్తామ ని హామీ ఇచ్చారు. పదవ తరగతి పరీక్షల్లో పదికి పది మార్కులు సాధించేందుకు విద్యార్థులు ఇప్పటి నుంచే కష్టపడి చదువుకోవాలని పేర్కొన్నారు. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం గురుకుల పాఠశాల ఏర్పాటు చేసి వారిని మంచి నైపుణ్యంగా తీర్చిదిద్ది భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు చదువులో ప్రతిభ చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ తాహసిల్దార్ సుజాత,ఎంపీడీవో వెంకటలక్ష్మి, మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వప్న, ఎంపీవో గఫూర్ ఖాద్రీ, పాఠశాల ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రత మనందరి బాధ్యత

- మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్





నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణ పరిశుభ్రత మనందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 3వ, 20వ, 21వ, 6వ వార్డుల్లో ఆయన పర్యటించారు. 3 వార్డులో ఖాళీ స్థలాల్లో చెత్త వేసి ఉండడం, పిచ్చి చెట్లు ఉండడం గమనించిన కమిషనర్ వెంటనే సంబంధిత ఖాళీ స్థలం యజమానులకు నోటీసులు జారీ చేయాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఆదేశించారు.కేసీఆర్ నగర్ రెండు పడక గదుల వద్ద రోడ్డు పక్కన వేసి చెత్తను వెంటనే తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. కోమటి చెరువు వద్ద గల ప్రభుత్వ ఆసుపత్రిలో వెలువడే హానికర చెత్తను పట్టణ శివారు బహిరంగ ప్రాంతాల్లో వేయకూడదని, తప్పనిసరిగా ధర్మ ఏజెన్సీ వారికి మాత్రం అందజేయాలని సూచించారు. 6వ వార్డులో శిధిలావస్థకు చేరిన గృహాలను పరిశీలించి వర్షాకాలం దృష్ట్యా శిథిలావస్థకు చేరిన గృహాలలో నివాసం ఉండకూడదని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. 20 వ వార్డులోని సిద్ధార్థ పాఠశాల వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఛాంబర్ నుంచి నీరు బయటకు రావడం గమనించి వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కుశాల్ నగర్‌లో గల స్మశానవాటికలో అసంపూర్తిగా ఉన్న మూత్రశాల మిగులు పనులను పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. అనంతరం బావిస్కాన పూల్ కెనాల్‌లో గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రీయాజుద్దీన్, సాకి ఆనంద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

- సీఐటీయూ దుబ్బాక టౌన్ కన్వీనర్ కంపెల్లి భాస్కర్ డిమాండ్





నవతెలంగాణ-దుబ్బాక రూరల్

కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించి, వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ దుబ్బాక టౌన్ కన్వీనర్ కంపెల్లి భాస్కర్ డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడిగా పెండింగ్లో ఉన్న ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం దుబ్బాక మండల పరిధిలోని తిమ్మాపూర్, రామక్కపేట పీహెచ్సీ సెంటర్లలో వైద్యాధికారులకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లతో కలిసి వారు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు దుబ్బాక టౌన్ కన్వీనర్ కంపెల్లి భాస్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆశాల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్తంగా అధికారులకు సమస్యలతో కూడిన వినతి పత్రాలు ఇవ్వాలని ఆశా యూనియన్ (సిఐటియు) ఆలిండియా కమిటీ నిర్ణయించిందనీ,ఇందులో భాగంగా ఈ వినతి పత్రాలను అందజేశామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఆశాలు పది లక్షల మంది పని చేస్తున్నారనీ గత 30 ఏళ్ల నుంచి కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్, గత 20 ఏళ్ల నుంచి ఆశాలు ఎన్‌ఎచ్ ఎం స్కీంలో భాగంగా పనిచేస్తున్నారనీ వీరంతా మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చెందినవారన్నారు. నిరంతరం పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారని పేర్కొన్నారు . ఆశ వర్కర్లు ప్రజలకు సేవలు అందిస్తున్న కేంద్ర ప్రభుత్వం నేటికీ గుర్తించడం లేదనీ విమర్శించారు.45వ, 46వ (ఐఎల్ సీ)ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసుల ప్రకారం ఆశాలను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం, రూ.26 వేల, పీఎఫ్, ఈఎస్ఐ సామాజిక భద్రత తదితర సౌకర్యాలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడం దేశానికే అవమానకరమని మండిపడ్డారు. 6 నెలలు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు అమలు చేయాలనీ, 20 రోజులు వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు, మెడికల్ సెలవుల కోసం ఖచ్చితమైన నిబంధనలు రూపొందించాలనీ కోరారు. యూనివర్సల్ హెల్త్ కేర్ హక్కు కోసం చట్టాన్ని అమలు చేయాలి, బడ్జెట్లో ఆరోగ్య రంగానికి జిడిపిలో 6శాతం నిధులు కేటాయించాలనీ, ఆరోగ్యం (ఆసుపత్రులతో సహా) వంటి అన్ని ప్రాథమిక సేవల ప్రైవేటీకరణ ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలనీ డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. ఆశాలను కార్మిక చట్టాల పరిధిలోకి తేవాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆషా వర్కర్లు మంజుల, భాగ్యలక్ష్మి, శారద, పద్మా, సంతోష, లత, శ్యామల, భారతమ్మ, లత, దేవలక్ష్మి , వసుందర, సుమలత తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట

ఆశా వర్కర్లను కేంద్ర ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని ఆశా కార్యకర్తల మండల అధ్యక్షురాలు డి. లక్ష్మీ డిమాండ్ చేశారు. మంగళవారం తొగుట పిహెచ్స్ లో వైద్య అధికారి డాక్టర్ రాధకిషన్ కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తల కనీస వేతనం రూ.26 వేల చెల్లించాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. దేశవ్యాప్తంగా ఆశాలు పది లక్షల మంది పని చేస్తు న్నారనీ పేర్కొన్నారు. గత 30 సంవత్సరాల నుండి కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్, 20 సంవత్సరాల నుంచి ఆశాలు ఎన్ఎచ్ ఎమ్మీంలో భాగంగా పని చేస్తున్నారనీ గుర్తు చేశారు. వీరంతా మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చెందినవారని అన్నా రు. నిరంతరం పేద ప్రజలకు ఆరోగ్య సేవలిందిస్తు, ప్రస్తుతం ప్రజలకు వస్తున్న సీజనల్ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి అరికట్టడం లో ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఆస్పత్రుల్లో డెలివరీల సంఖ్యను పెంచడంలో ఆశాలు కీలక పాత్ర పోషిస్తున్నారని అయిన వారికి చాలి చాలని వేతనాలతో జీవనం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటి కైన కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్య కర్తలు సజీదా, కనకవ్వ, నసీమ, భాగ్యలక్ష్మి, కృష్ణ వేణి తదితరులు ఉన్నారు.



శాంతియుత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకోవాలి

- ప్రతి ఒక్కరూ ఆన్ లైన్‌లో అప్లై చేసుకోవాలి
- చేర్యాల సీఐ ఎల్.శ్రీను,
- మున్సిపల్ కమిషనర్ నాగేందర్
- గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

ప్రశాంతమైన వాతావరణం లో వినాయక నిమజ్జనం నిర్వహించుకోవాలని చేర్యాల సీఐ ఎల్. శ్రీను, చేర్యాల మున్సిపల్ కమిషనర్ ఎస్. నాగేందర్ అన్నారు.చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక మండపాల నిర్వహకులతో మంగళవారం చేర్యాల పోలీస్ సర్కిల్ కార్యాలయంలో మత పెద్దలతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ శ్రీను, మున్సిపల్ కమిషనర్ నాగేందర్ మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో వినాయక మండపాల వద్ద కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు. మండపం వేసేటప్పుడు అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, .వినాయక మండపం వద్ద కచ్చితంగా ఒక వాలంటీర్ ఉండేటట్టు చూసుకోవాలని తెలిపారు, బాక్స్ టైపు రెండు బాక్సులు పెట్టుకోవాలని సూచించారు. డీజే కు పర్మిషన్ లేదని, మండపాల నిర్వాహకులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు. విగ్రహాలను ప్రజలు తిరిగే రోడ్ల పైన, కాలిబాట పైన ప్రతిష్టించి ట్రాఫిక్ అడ్డంకులు కలిగించరాదన్నారు. గణేష్ మండపాలను మంచి నాణ్యత కలిగిన వస్తువులతో కట్టాలని తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు స్పీకర్లను తక్కువ సౌండ్‌తో రాత్రి 10.00 గంటల వరకు మాత్రమే వినియోగించాలని అన్నారు. ఈ సమావేశంలో వినాయక మండపాల ఆర్గనైజర్లు, కమిటీ మెంబర్లు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-రాయపోల్

గణేష్ మండపాల నిర్వాహకులు వినాయక చవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని గజ్వేల్ ఏసిపి పురుషోత్తం రెడ్డి అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వహకులు ఆన్లైన్ లింక్ ద్వారా విగ్రహాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోని అనుమతి తీసుకోవాలన్నారు.ఆన్లైన్లో అనుమతి తీసుకుంటే భద్రత కల్పించడం సులువు అవుతుందన్నారు. గణేష్ మండపాల నిర్వహకులు తాము ఏర్పాటు చేసే గణేష్ ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం,నిమజ్జనం తేదీ,ప్రదేశం మొదలైన సమాచారంతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా తక్కువ శబ్దకాలుష్యంతో బాక్స్ టైప్ స్పీకర్లను ఏర్పాటు చేసుకోవాలి. మండపాల్లో ఎట్టిపరిస్థితులోను డిజేలను ఏర్పాటు చేయరాదు. గణేష్ మండపంలో 24 గంటలు ఒక వాలంటీర్ ఉండే విధంగా నిర్వహకులు తగు చర్యలు తీసుకోవాలి.మండపాల్లో ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లయితే తక్షణమే డయల్ 100 గాని లేదా సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నెంబర్ 8712667100, గజ్వేల్ ఏసీపీ 8712667330 స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తొగుట సీఐ షేక్ లతీఫ్, దౌల్తాబాద్ తహసీల్దార్ సుజాత, ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్, ఎంపీడీవో వెంకటలక్ష్మి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ బదిలీలు సహజం




నవతెలంగాణ-గజ్వేల్

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు సహజమని గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్ అన్నారు. మంగళవారం గజ్వేల్ వ్యవసాయ సంచాలకుల కార్యాలయం పరిధిలోని పలువురు ఏఈవోలు, ఏవోలు బదిలీలు అయ్యారు. ఈ సందర్భంగా గజ్వేల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో బదిలీలు జరుగుతుంటాయని ఎక్కడ వెళ్లిన రైతులకుసేవ చేయాలని ఆయన కోరారు. గత ఆరేళ్ల నుంచి ఇక్కడ పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారని ఇతర ప్రాంతాల్లో కూడా మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆయన పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న వ్యవసాయ అధికారులకు ఏడీఏ బాబు నాయక్, గజ్వేల్ ఏవో నాగరాజు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏవోలు నాగరాజు, శివరామకృష్ణ, గోవిందరాజులు, నరేష్, ఏఈఓలు, జూనియర్ సహాకులు తదితరులు పాల్గొన్నారు. కొండపాక మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని సిద్దిపేట జిల్లా వ్యవసాయ కార్యాలయానికి బదిలీ అయ్యారు. అదేవిధంగా గజ్వేల్ మండలం కోమడిబండ ఏఈఓ వెన్నెల, రాయపోల్ మండలం వడ్డేపల్లి ఏఈఓ మధులి, కొండపాక మండలం మర్పడుగా ఈవో విష్ణుకుమార్ మెదక్ జిల్లాకు బదిలీ అయినట్లు ఆయన తెలిపారు. రాయపోల్ ఏఈఓ ప్రశాంత్ మిరుదొడ్డి మండలానికి బదిలీ అయ్యారు.

నూతన చట్టం ప్రకారం కేసు నమోదు

- దొంగతనం కేసులో వ్యక్తికి జైలు శిక్ష
- గజ్వేల్ సీఐ బి.సైదా



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

నూతన చట్టాల ప్రకారం మోటార్ సైకిల్ దొంగతనం కేసులో ఒక నేరస్తునికి 1 ఏడాది జైలు శిక్ష, ఇద్దరు నేరస్తులకు 6 నెలల జైలు శిక్ష విధించమని గజ్వేల్ సీఐ బి. సైదా తెలిపారు. మంగళవారం నూతన చట్టాల అమలులో ముగ్గురికి జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా సీఐ సైదా మాట్లాడుతూ చట్టం కళ్ళు కప్పి ఏ ఒక్క నేరస్థుడు తప్పించుకోలేడని హెచ్చరించారు. మోటార్ సైకిల్ దొంగతనంలో కొలకూరి ప్రశాంత్ రెడ్డి, శంకరపల్లి నాందేడ్ మహారాష్ట్ర డిస్ట్రిక్ట్ ఏడాది జైలు శిక్ష విధించారన్నారు. మరో ఇద్దరు యం. శివశంకర్ నివాసం రామాయంపేట మెదక్ జిల్లా, రాయలపురం యాదగిరి,నివాసం మంగళ్ ఘాట్ హైదరాబాద్ ఆరు నెలల జైలు శిక్ష పడిందన్నారు. నెల రోజుల క్రితం గజ్వేల్ పట్టణంలో మోటార్ సైకిల్ దొంగలించరని మొదటి నేరస్తుడైన ప్రశాంత్ రెడ్డి రెండు కేసులలో అరెస్టు చేయడం జరిగిందన్నారు. మరో ఇద్దరు నిందితుల్ని కలిపి మొత్తం ముగ్గురి పై నూతన చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి పై నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్కు పంపించడం జరిగిందన్నారు. అనంతరం తదుపరి పరిశోధన పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ వేయడం జరిగిందన్నారు.ఈ ముగ్గురు నేరస్తులు కోర్టు ట్రయల్ సమయంలో నేరం చేశారని ఒప్పుకున్నందున నూతన చట్టాల ప్రకారం విచారణ అనంతరం గజ్వేల్ ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి. సౌమ్య జైలు శిక్ష విధించరన్నారు. ముగ్గురి నిందితులకు జైలు శిక్ష పడడానికి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె శంకర్, గోపాల్ గౌడ్ ఏఎస్ఐ, శంకర్ ఎస్ఐ, కోర్టు కానిస్టేబుల్ కుమార్, కీలక పాత్ర వహించరన్నారు.

కమిషనర్‌ను కలిసిన మున్సిపల్ చైర్ పర్సన్

నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట మున్సిపల్ నూతన కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అశ్రీత్ కుమార్‌ని మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు, వైస్ చైర్మెన్ జంగిటి కనకరాజు, బీఆర్ఎస్ నాయకులు వజీర్, అబ్దుల్ మొయిజ్, కో ఆప్షన్ సయ్యద్ లు కలసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్ప గుచ్ఛమిచ్చి, శాలువాతో సన్మానించారు.



గజ్వేల్ ప్రజలు అప్రమత్తంగా ఉండండి

- గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ ఆర్డిఓ బన్సీలాల్ అన్నారు. మంగళవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలను తెగిన చెరువు కుంటలను ఆయన మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి, కమిషనర్ గోల్కొండ నరసయ్య, తహసీల్దార్ శ్రవణ్ కుమార్ , గజ్వేల్ సీఐ సైదాతో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల కురుస్తున్న భారీ వర్షాలకు చెరువు కుంటలు నిండుతున్నాయని కొన్ని చిన్న కుంటలు తెగిపోయే ప్రమాదం ఉందని ఆయన చెప్పారు. ప్రజ్ఞాపూర్ ఊర చెరువు కాలువ నీటి ప్రధాని తగ్గించే ప్రయత్నం చేస్తున్న మన్నారు. అంతేకాకుండా కురుస్తున్న వర్షాల్లో తిరగవద్దని అత్యవసరం ఉంటేనే బయటకు రావాలని ఆయన కోరారు. కాలం చెల్లిన ఇండ్లలో నివసించవద్దని అత్యవసరం ఉంటే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నంత అధికార దృష్టికి తీసుకుపోతున్నట్లు ఆయన చెప్పారు. మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి



నవతెలంగాణ- రాయపోల్

విద్యార్థులకు విజ్ఞానం అందించాలంటే ఉపాధ్యాయులు నిరంతరం జ్ఞానం నేర్చుకోవాలని మండల విద్యాశాఖ అధికారి బండి నర్సమ్మ అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండలం ఇందు ప్రియాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి ఎందుకంటే విద్యార్థులకు జ్ఞాన సంపద అందించాలంటే ఉపాధ్యాయుడు నిరంతరము నేర్చుకుని విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించాలని సూచించారు. కాంప్లెక్స్ సమావేశంలో నేర్చుకున్నటువంటి తరగతి గది నిర్వహణ బోధనోపకరణముల నిర్వహణ వినూత్న బోధనలు తరగతి గదిలో కూడా విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు అఫ్జల్ హుస్సేన్, రిసోర్స్ పర్సన్ త్యాగరాజు, శ్రీనివాస్ సీఆర్పీలు చంద్రమౌళి, రాజు, నగేష్, ఎమ్మార్సీ సిబ్బంది పెంటయ్య,ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అన్న చెల్లెలు ఆత్మహత్య చేసుకున్న కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ- రాయపోల్

ఒకే కుటుంబానికి చెందిన అన్న చెల్లెలు ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజాసేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ తెలిపారు. మంగళవారం దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామంలో సంవత్సరం క్రితమే తల్లి శ్యామల అనారోగ్యంతో మృతి చెందడం, ఇప్పుడు అన్న రమేష్ చెల్లెలు కళ్యాణి ఒకేరోజు ఆత్మహత్య చేసుకొని మృతి చెందడం చాలా బాధాకరం. వారి కుటుంబంలో ఐదుగురు సభ్యులకు ఇప్పుడు కిష్టయ్య, పెద్ద కుమారుడు మహేష్ ఇద్దరు మాత్రమే మిగిలారని, ఇలాంటి హృదయ విషాదకరమైన సంఘటన ఏ కుటుంబానికి రాకూడదని శోకతప్త హృదయంతో పేర్కొన్నారు. వీరి మృతితో ఇందుప్రియాల్ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొన్నదని, కుటుంబ సభ్యుల రోదనలు చూసి గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. రమేష్, కళ్యాణి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కిష్టయ్య కుటుంబానికి తమ వంతు సహకారంగా ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ ఫౌండేషన్ కోశాధికారి మహమ్మద్ ఉమర్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ప్రణీత మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు 2024 -25 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత పీజీ కోర్సులలో 55 శాతం మార్కులతో పాసై ఉండాలని, (ఎస్సీ, ఎస్టీ లకు 50 శాతం సరిపోతుంది) ఎన్ఈటీ, ఎస్ఈటీ, ఎస్ఈటీ, పిహెచ్‌డీ ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని ఈ నెల 6 వరకు దరఖాస్తులు స్వీకరించ బడుతుందని తెలిపారు. 9 సోమవారం ఉదయం 10.30 నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) సిద్దిపేట కళాశాలలో ఇంటర్వ్యూ నిర్వహించబడుతాయని అన్నారు. బాటనీ1, నివాలోజి 1, పబ్లిక్ అడ్మిస్ట్రేషన్1 లో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. మిగతా సమాచారంకోసం చేర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సంప్రదించాలని కోరారు.

భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- సేవా స్వచ్ఛ సంస్థ అధ్యక్షులు దేశబోయిని నర్సింహులు



నవతెలంగాణ-గజ్వేల్

గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అనేక ఇబ్బందులు ఎదురవు తున్నాయని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సేవా స్వచ్ఛ సంస్థ అధ్యక్షులు జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబో యిని నర్సింహులు పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్లో ఆయన మాట్లాడుతూ చెరువులు, చెక్ డ్యామ్ లు మత్తళ్లు దుంకుతున్నాయన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రోడ్ల పై నీళ్లు నిలవకుండా చర్యలు తీసుకోవాలి. పాత గోడలు, ఇల్లు కూలిన దగ్గర ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సాధ్యమైనంతవరకు బయటకు వెళ్లకుండా ఉండటమే శ్రేయస్కారమన్నారు. విద్యుత్ స్తంభాలు, నియంత్రికలు, వైర్లు, మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలి. తడిసిన విద్యుత్ స్తంభాల సపోర్ట్ వైర్, విద్యుత్ ఉపకరణాలను తాక వద్దన్నారు. బట్టలు ఆరేసుకునే తీగకు విద్యుత్ తీగకు వైర్లు కలపరాదు. తెగిపడిన, వేలాడుతున్న విద్యుత్ ఉంటున్న అన్నారు. ట్రాన్స్ఫార్మర్ల వద్ద శబ్దం వచ్చిన విద్యుత్ మరమ్మతులు ఉన్న సంబంధిత సిబ్బందికి సమాచారం అందించాలన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తాం

- గజ్వేల్ కాంగ్రెస్ నాయకులు అంజనేయులు



నవతెలంగాణ- గజ్వేల్

సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలను ప్రజలకు అందిస్తున్నామని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ నాయ కులు అంజనేయులు అన్నారు. మంగళవా రం గజ్వేల్ లో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందేలా చూస్తామన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తామన్నారు. మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు, మండల్ పరిషత్, జెడ్పిటి స్థానాలు కాంగ్రెస్ గెలుచుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రైతు సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

తిమ్మారెడ్డిపల్లి సీతారామాంజనేయ స్వామికి మకర తోరణాలు



నవతెలంగాణ-కొండపాక

జగద్గిరిగుట్ట కు చెందిన కన్నోజు శ్రీనివాసచార్యులు భాగ్యలక్ష్మి దంపతులు వారి కుమారుడు వేదాన్ చార్యులు కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామ శ్రీరామ అంజనేయ స్వామి దేవాలయములోని సీతారామాంజనేయ స్వామి కి మకర తోరణాలు మంగళవారం అందజేశారు. అర్చకులు బూర్గోజు బాలబ్రహ్మం కోరిక మేరకు వారు 26 వెల విలువైన వాటిని అందచేశారు. ఈ సందర్భంగా దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

దుర్గమ్మ గుడిలో లలిత సహస్ర పారాయణం



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండల కేంద్రంలోని దుర్గమ్మ దేవాలయ ంలో లలితా సహస్ర పారాయణ కార్యక్రమాన్ని ముత్యాల మంజుల సంజీవరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని ప్రజలంతా ఆరోగ్యంగా జీవించాలని, పాడిపంటలు పండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాసెట్టి రాణి, నార్ల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

- జిల్లా కలెక్టర్



నవతెలంగాణ-దుబ్బాక

కేజీబీవీ, మైనారిటీ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని అందుకయ్యే ఖర్చు అంచనా వేసి తమకు

నివేదిక అందించాలని, వాటికి త్వరలోనే నిధులు మంజూరు చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలుపెడతామని జిల్లా కలెక్టర్ ఎమ్.మను చౌదరి చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో మెరుగైన విద్యా బోధన, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. మంగళవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక పురపాలిక కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్ని కలెక్టర్ మనుచౌదరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టళ్లలో విద్యార్థులకు కలుగుతున్న అసౌకర్యాలు, నెలకొన్న సమస్యల పట్ల ఆరా తీశారు. విద్యా పరంగా ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. .కస్తూర్బా పాఠశాలలో అదనపు తరగతి గదులు, కాంపౌండ్ వాల్, అదనంగా మరుగుదొడ్లు, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో భవన స్లాబ్ లీకేజీ, డైనింగ్ హాల్ రిపేరు, కిచెన్ షెడ్డు, అదనపు తరగతి గదులు,హాస్టల్ పై అంతస్తులో రెయిలింగ్ ఏర్పాటు, స్లాబ్ వేసి గదులు నిర్మించకుండా అసంపూర్తిగా ఉన్న పై అంతస్తును సత్వరమే వినియోగంలోకి తెచ్చేలా అంచనా వేసి ప్రతిపాదనలు తమకు పంపాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, రెవెన్యూ,మున్సిపల్, విద్యాశాఖల అధికారులను ఆదేశించారు.పదో తరగతి విద్యార్థులు 10/10 జీ పీ ఏ సాధించాలని ఆకాంక్షించారు. కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న మెరిట్ విద్యార్థిని అక్షయను కలెక్టర్ మను చౌదరి చేతుల మీదుగా శాలువాతో సన్మానించడం జరిగింది. మైనార్టీ హాస్టల్ పక్కనే గల ఐడబ్ల్యూహెచ్ఎస్ లో నెలకొన్న సమస్యలను వార్డెన్లు పరుశు రాం,వెంకటేశ్,నరేష్ లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ప్రతిపాదనలు పంపాలని సూచించారు.కలెక్టర్ వెంట డీపీఆర్ఓ రవికుమార్, మున్సిపల్ కమీషనర్ కళ్యాణం రమేష్ కుమార్, తహశీల్దార్ నల్ల వెంకటరెడ్డి,ఎంఈఓ జోగు ప్రభు దాస్,ఎంపీడీవో వేలేటి భాస్కర శర్మ,ఎంపఓ నరేందర్ రెడ్డి,ఆర్ఐలు నరసింహారెడ్డి, నరేందర్,కే జీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వాతి,మైనారిటీ స్కూల్ ప్రిన్సిపల్ విమలరెడ్డి, ఉపాధ్యాయ బృందం,వార్డెన్లు పలువురున్నారు

రాయపోల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఏసీపీ



నవతెలంగాణ-రాయపోల్

గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు పట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం రాయపోల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజుల నుంచి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వలన రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయని, రాయపోల్ మండల పరిధిలో చెరువులు, కుంటలు నిండి మత్తడి దుంకుతున్నాయని, ప్రమాద భరితంగా ఉంటే అప్రమత్తంగా ఉండి ప్రజలను ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడైనా రోడ్లు తెగిపోయి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగితే జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. నూతన చట్టాలపై పోలీస్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఉన్న విపరీత వర్షాల కారణంగా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. రాబోయే వినాయక చవితి సంధర్భంగా పాటించవలసిన విధివిధానాలను గురించి సిబ్బందికి వివరిస్తూ, అందరూ తమ విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తొగుట సీఐ షేక్ లతీఫ్, రాయపోల్ ఎస్ఐ విక్కుర్తి రఘుపతి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- సీపీ. డాక్టర్ బి. అనురాధ.



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీపీ. డాక్టర్ బి. అనురాధ అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటల వాగులు, వంకలు నిండి ఉధృతంగా ప్రవహిస్తున్నందున అటువైపు ప్రజలు ప్రయాణికులు వెళ్లకుండా బారికెట్స్ ఏర్పాటు చేసి అనునిత్యం నిఘా ఉంచాలని సూచించారు. నీటి ప్రవాహం గురించి అన్ని జాగ్రత్త చర్యలు తీసుకొని ప్రత్యక్షంగా వెళ్లి పర్యవేక్షించాలని అన్నారు. జిల్లాలో మోయ తుమ్మెద వాగు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున ఆ రహదారిపై ప్రజలను అప్రమత్తం చేయాలని హుస్నాబాద్ పోలీసులకు సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలతో, ప్రజాప్రతినిధుల తో ఫోన్ లో మాట్లాడి పరిస్థితి తెలుసుకుని తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వర్షాల వల్ల ఏదైనా విపత్కర సమస్య వస్తే డయల్ 100, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నెంబర్ 8712667100 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

గణేష్ మండపాల నిర్వాహకులు నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి.

గణేష్ మండపాల నిర్వహకులు నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీపీ. డాక్టర్ బి. అనురాధ అన్నారు. గణేష్ నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించేందుకుగాను గణేష్ నవరాత్రి మండపాల నిర్వహకులకు, ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు సీపీ పలు సూచనలు చేసారు. గణేష్ మండపాల నిర్వహకులు విగ్రహాల ఏర్పాటుకు ఆన్లైన్ ద్వారా పోలీసుల అనుమతి తీసుకోవాల్సి వుంటుందని, ఇందుకోసం ముందుగా నిర్వహకులు తాము ఏర్పాటు చేసే గణేష్ ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం,నిమజ్జనం తేదీ,ప్రదేశం మొదలైన సమాచారంతో తెలంగాణ పోలీస్ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ప్రోటోకాల్ వెబ్సైట్ ద్వారా మండపాల నిర్వహకులు పూర్తి వివరాలను నమోదుచేసుకోని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత ఏసీపీలు ఆన్లైన్ ద్వారా అనుమతులు జారీచేస్తారని తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన



నవతెలంగాణ-ములుగు

సిద్దిపేట జిల్లా ములుగు మండలం లక్షిరాసాగర్ గ్రామ పరిధిలో ఉన్న హంస హెూమియోపతి మెడికల్ కాలేజ్ హాస్పిటల్ విద్యార్థిని విద్యార్థులకు డాక్టర్లకు మహిళల రక్షణ చట్టాల గురించి, ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో, షీ టీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి అవగాహన కల్పించిన గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ దుర్గ, ములుగు ఎస్ఐ విజయ్ కుమార్ గజ్వేల్ షీటీమ్ బృందం, ర్యాగింగ్ చేయడం వల్ల కలిగే నష్టాల గురించి, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుంది, మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం మహిళల భద్రత మా ముఖ్య బాధ్యత భారతదేశంలో అమలైతున్న నూతన చట్టాల గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి. ఈ సందర్భంగా రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ దుర్గ మాట్లాడుతూ.. విద్యార్థినీ విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సోషల్ మీడియాలో , వాట్సాప్ కు వచ్చే మెసేజ్లు ఓపెన్ చేసి చూసి వదిలేయాలి సూచించారు.పిల్లలు మహిళలు ఏదైనా సమస్యలు ఇంట్లో కానీ బయట కానీ ఎదుర్కొంటే వెంటనే షిటీమ్ వాట్సప్ నెంబర్ 8712667343 మహిళా పోలీస్ స్టేషన్ నెంబర్ 8712667435 హైదరాబాద్ ఉమెన్ సేఫ్టీ వింగ్ 9440700906, 040-27852246 సమాచారం అందించాలని, సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు ఎస్ఐ విజయ్ కుమార్, కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ నూరుస్ సాహెర్ ఖాన్ మేడమ్, మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ క్రాంతి శ్రీనివాస బాబు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అధ్యాపకులు, గజ్వేల్ షి టీం ఏఎస్ఐ శ్రీరాములు, మహిళా కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుల్ రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

తోర్నలలో ఘనంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ దినోత్సవం

- పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి రాధిక
- ప్రధాన శాస్త్రవేత్త అధిపతి డాక్టర్. ఎస్. శ్రీదేవి



నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పంటలలో ఉత్తమ సాగు పద్ధతుల పై రైతులు-శాస్త్రవేత్తల-విద్యార్థులు చర్చాగోష్టి ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రధాన శాస్త్రవేత్త , వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధి లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎనలేని కృషి చేసి చేసిందని అన్నారు. అనతి కాలంలో విశ్వవిద్యాలయం నుంచి కొత్త వంగడాలు సృష్టించి రైతులకు అందుబాటులోకి తీసుకు వచ్చిందని సూచించారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి రాధిక మాట్లాడుతూ పంట వైవిధ్యీకరణ వైపు రైతులు మొగ్గు చూపాలని రైతులకు వివిధ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. పెసరలో ఎంజీజి -385 రకంలో రైతులు విద్యార్థుల క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వివిధ క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేసారు. రైతులకు వరిలో మొగి పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరై డ్, మొక్కజొన్న లో కత్తెర పురుగు నివారణకు ఇమామె క్టిన్ బెంజోయెట్, ప్రత్తి పంటలలో రసం పీల్చు పురుగులకు అసెఫేట్ , వేప నూనె, లింగాకర్షక బుట్టలు అందచేసారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీ జయ , పల్లవి, ఉమారాణి ,సరిత, రమాదేవి, శ్వేత, సతీష్ వివిధ గ్రామాల రైతులు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు

టెన్నికాయిట్ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు క్రీడాకారుల ఎంపిక



నవతెలంగాణ-సిద్దిపేట

టెన్నికాయిట్ రాష్ట్ర అసోసియేషన్ ఆదేశాల మేరకు ఈనెల 1 నుంచి 3 వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అండర్ 14 బాలుర విభాగం పోటీలలో సిద్ధిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో 8వ తరగతి చదువుతున్న చందు, దినేష్ అలాగే, బాలికల విభాగంలో టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బెజ్జంకి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న తన్విక జాతీయ స్థాయి పోటీల కు ఎంపిక అయ్యారనీ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు కాటం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి క్యాతం రాజ్ కుమార్‌లు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ

జాతీయస్థాయి పోటీలు ఈనెల 30 నుంచి అక్టోబర్ 4 వరకు జమ్మూ రాష్ట్రంలో జరగనున్నాయనీ, వీరు తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొని జాతీయస్థాయి పోటీలలో కూడా చక్కటి ప్రతిభ కనబరిచి, తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన చందు, దినేష్‌ను సిద్దిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, ఉపాధ్యాయ బృందం, ఇందుకు శిక్షణ ఇచ్చిన కాటం శ్రీనివాసును అభినందించారు. బెజ్జంకి టిజిఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ విజయ, ఉపాధ్యాయ బృందం చక్కటి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు సింగారెడ్డి శౌరి నీ అభినందించారు.

ఖమ్మం ప్రజలు మంత్రులకు బుద్ధి చెప్పాలి

- బీఆర్ఎస్ పార్టీ నాయకులు నర్సింగారావు



నవతెలంగాణ- గజ్వేల్

కాంగ్రెస్ ముఖ్యమంత్రి, మంత్రుల తీరును ఖమ్మం ప్రజలు గమనించాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కళ్యాణ్ కార్ నర్సింగరావు అన్నారు. మంగళవారం గజ్వేల్లో ఆయన ఇంటిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కురుస్తున్న భారీ వర్షాలకు జల వలయంలో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు సహాయం అందించేందుకు వచ్చిన బీఆర్ ఎస్ పార్టీ మాజీ మంత్రులపై దాడి చేయడం పట్ల ఖమ్మం ప్రజలు ఆలోచించాలని కోరారు. వరద ఉధృతి అధికంగా ఉండి ఆస్తి ప్రాణం నష్టం జరగకుంటే చర్యలు తీసుకోవాలని అడిగినందుకు కాంగ్రెస్ నాయకులతో మంత్రులు దాడి చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండాలుగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. మంత్రులను ప్రజలు నిలదీస్తున్నారని ఆయన చెప్పారు. ఇది జీర్ణించుకొని మంత్రులు బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులపై దాడి చేస్తున్నారని ఆయన చెప్పారు.ప్రజలను కాపాడకుండా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఎప్పుడు స్పందించారో ఒకసారి మీడియాను పరిశీలించాలని ఖమ్మం ప్రజలను కోరారు. ఇప్పటికైనా దాడులను కాంగ్రెస్ గుండాలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు.

అపూర్వ సమ్మేళనం



నవతెలంగాణ-కొండపాక

మండల పరిధిలోని సిరినగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-2005 పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థు లు మంగళవారం రోజున ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు 20 ఏళ్ల తర్వాత పాఠశాలలో కలుసుకొని చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు అనంతరం వారు తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులు బలరాం, యాదగిరి,ప్రభాకర్ రెడ్డి, రామస్వామి, శ్రీనివాస్, పద్మ లను శాలువా, మేమంటలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎర్రోళ్ల రమేష్, అనిల్, ప్రభాకర్, కిరణ్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు

పంట పొలాలను పరిశీలించిన కలెక్టర్

- గజ్వేల్ మండలం కోనాపూర్ వద్ద నీట మునిగిన పంటలు
- అధికారులకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశం
- జిల్లా కలెక్టర్ మను చౌదరి



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు పాడవకుండా రైతులు అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. మంగళవారం గజ్వేల్ మండలం కోనాపూర్, ప్రజ్ఞాపూర్ శివారులలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ గత నాలుగు రోజుల కురుస్తున్న వర్షానికి జిల్లాలో పంటలు పూర్తిగా నీట మునిగయన్నారు. రైతులు వారి పొలాల వద్ద నిలువ ఉన్న నీటిని పంట పొలం నుంచి తీసివేయాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని వారికి సపోర్టుగా ఉంటూ పంటను కాపాడుకోవాలన్నారు. వాటిని ఇరిగేషన్ అధికారులు గజ్వేల్ తహసీల్దార్ శ్రావణ్ కుమార్, సోమవారం వచ్చి తాత్కాలిక చర్యలు చేపట్టారన్నారు. వరద నీరు అధికమై పంటల్లో చేరాయని వాటిని చిన్న కాలువ ద్వారా దిగువకు వదిలారన్నారు. ఇంకా రెండు మూడు రోజులు ఉండే ఈ వర్షాలకు ప్రజలు ఎవరు బయట తిరగవద్దన్నారు. తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఎలాంటి ప్రమాదాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లు పూరి గుడిసెల్లో నివసించవద్దని కోరారు. ఎలాంటి సహాయానికైనా మండలాధికారులకు పోలీసులను ఆశ్రయించాలని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో 100 డయల్ చేసి పోలీసులకు సమాచారం అందిస్తే తగిన సహాయాన్ని పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బన్సీలాల్, రెవెన్యూ అధికారులు,రైతు లు, తదితరులు పాల్గొన్నారు

బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలపై దాడి సిగ్గుచేటు

- సీఎంకు, మంత్రుల మధ్య సయోధ్య లేదు
- బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ ఇన్చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

ఖమ్మం జిల్లా ప్రాంతంలో వరదల్లో చిక్కుకున్న ప్రజలను ఆదుకునేందుకు వెళ్లిన మాజీ మంత్రి హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, పువ్వాడ అజయ్‌లపై కాంగ్రెస్ గుండాల దాడి సిగ్గు చేయటానికి బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ ఇంచార్జి ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీ నాయకులు సహాయం చేయడం కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతుందని ఆ పైగా దాడి చేయడం సిగ్గుచేటు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఖమ్మం వరద బాధితులను ఆదుకుంటే కాంగ్రెస్ నాయకులు ఎందుకు జీర్ణించుకోవడంలేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులకు మధ్య సయోధ్య లేదని విమర్శించారు. ప్రతి ఎకరాకు రూ.25 వేల చొప్పున రైతు పంటకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరదల్లో చిక్కుకొని మృతి చెందిన కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఇల్లు కోల్పోయిన వారికి తక్షణ సాయం కింద రూ.ఐదు లక్షలు ఇవ్వాలని కోరారు. సర్కార్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నియోజకవర్గాల్లో పర్యటించి ప్రజలకు సహకారం అందించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు దమ్ముంటే ప్రజలకు సాయం చేయాలని దాడులు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కాంగ్రెస్ గుండాలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వర్షాలు వస్తున్నాయని వాతావరణం శాఖ చెప్పినప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి పట్టించుకోలేదని వరదలో చిక్కుకున్న వారికి నీళ్లు ఆహారం ఇవ్వకపోవడంతో ఇచ్చిన వారిపై దాడి చేయించడం సీఎం రేవంత్ రెడ్డికి తగదు అన్నారు.

నర్సారెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తాం

- మార్కెట్ డైరెక్టర్లు



నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు యాదగిరి, కృష్ణ గౌడ్, కర్నాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా గజ్వేల్ అభివృద్ధికి నోచుకోలేదని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లోనే అభివృద్ధి సాధ్యమని వారు చెప్పారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నర్సారెడ్డి నాయకత్వంలో పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఇస్తున్నారని వారు చెప్పారు. ప్రముఖ న్యాయవాది అశోక్ రెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నాయకత్వంలో గజ్వేల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ తదితరుల సూచనలు సలహాలు పాటిస్తూ ముందుకు వెళ తున్నామన్నారు. గతంలో ఎవరు కూడా అభివృద్ధి చేయలేదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట నరసింహారెడ్డి, అమరేందర్, బాల్ రెడ్డి, దాచారం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి,ఎంపీలను కలసిన మర్కుక్ బీజేపీ నాయకులు



నవతెలంగాణ-మర్కుక్

కేంద్రమంత్రి ,బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ను హైద్రాబాద్ లోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో మంగళవారం బీజేపీ మర్కుక్ మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ సింగ్ అధ్వర్యంలో మర్కుక్ నాయకులు కలసిశారు. బీజేపీ మర్కుక్ మండల కోశాదికారి పాలే మహేష్ పుట్టిన సందర్భంగా కేంద్ర మంత్రి, ఎంపీని కలసి ఆశీస్సులు

గీతమ్‌లో రీసెర్చ్ స్పేస్ ప్రారంభం



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ (జీఎస్‌టి)లోని ఇంజనీరింగ్ విభాగాల మధ్య ఆవిష్కరణలు, సహకారాన్ని పెంపొందించడానికి నెలకొల్పిన రీసెర్చ్ స్పేస్‌ను జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండీసీ) జనరల్ మేనేజర్ (పరిశోధన-అభివృద్ధి) ఎస్.కె. చౌరా సియా లాంఛనంగా ప్రారంభించారు. ఇది మెకానికల్ ఇంజనీరింగ్, సివిల్, ఈఈసీఈ, సీఎస్ఈ విభాగాలకు ఉమ్మడి కేంద్రంగా పనిచేస్తు ందని, ఆవిష్కరణ, పరిశోధనా నైపుణ్యాన్ని పెంచడానికి ఉపకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతికను అందిపు చ్చుకుని మంచి ఆవిష్కరణలు చేయడానికి దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆధ్యాపకులు, పరిశోధక విద్యార్థులకు చౌరాసియా సూచించారు.ఈ అధునాత రీసెర్చ్ స్పేస్ ఇరవై అత్యాధునిక కంప్యూటర్లను నెలకొల్పామని, ఒక్కొక్కటి 13వ తరం ఇంటెల్ కోర్ ఐ7 ప్రాసెసర్లతో 4.5 గిగాహెర్ట్జ్ సామర్థ్యం, 8 జీబీ రామ్ పనిచేస్తాయని, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ ని, రామశాస్త్రి వివరించారు. వినూత్న పరిశోధన, ఆచరణాత్మక అభ్యాసం ద్వారా ఇంజనీరింగ్ జ్ఞానం, నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఈ రీసెర్చ్ స్పేస్‌ను అంకితం చేస్తున్నట్లు ఆయన చెప్పారు.ఈ ప్రారం భోత్సవంలో పలు విభాగాల అధిపతులు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద నీటితో ఇబ్బందుల్లేకుండా చర్యలు



నవతెలంగాణ-జహీరాబాద్

వరద నీటి ముప్పుతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్టు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రధాన కాలువలైన ఆర్యనగర్, గడి ముగునీటి కాలువల ద్వారా ప్రవహిస్తున్న వరద నీటిని ఎప్పటి కప్పుడు పట్టణం నుంచి బయటకు వెళ్లేవిధంగా సిబ్బంది సహకారంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్టు చెప్పారు. గత వర్షాకాల సీజన్లో చిన్న హైదరాబాద్ నుంచి గడి, ఆర్యనగర్, శాంతినగర్ హౌసింగ్ బోర్డ్ నుంచి వచ్చినటువంటి వరద నీటితో లోతట్టు ప్రాంతంలోని వసంత్ విహార్ , ఇందిర ప్రస్థ కాలనీల్లో ఇండ్లలోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడినట్టు గుర్తు చేశారు. కానీ ఈసారి అలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా.. వసంత్‌విహార్, ఇంద్రప్రస్థ కాలనీల్లో కాలువలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించడంతో వరద నీటి ముప్పు వాటిల్లలేదన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లతోపాటు కింది స్థాయి సిబ్బంది పూర్తిస్థాయి బాధ్యతతో విధులు నిర్వహించి పట్టణ ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం ఇంకా వరద నీరు కాలువల్లో పూర్తిగా నిండి వెళ్లడంతో దోమలు, పందుల బెడదతో రకరకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని.. కనుక వార్డుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని జెసిబి, ట్రాక్టర్లు సాయంతో ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామన్నారు. రోడ్లపై ప్రయాణిస్తున్న వారు కాస్త జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. వర్షానికి పట్టణంలోని చాలా ప్రాంతాల్లో రోడ్లన్నీ దెబ్బతిన్నాయన్నారు. వాటికి సంబంధించిన నివేదికలను జిల్లా అధికారులకు పంపుతున్నట్టు తెలిపారు. నిధులు వచ్చిన వెంటనే మరమ్మత్తు కార్యక్రమాలను చేపడతామన్నారు.

మేకల దొంగతనాలను పట్టుకున్న పోలీసులు



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

మూడు జిల్లాలలో భారీ ఎత్తున మేకల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు అల్లాదుర్గం సిఐ రేణుక రెడ్డి తెలిపారు. పెద్దశంకర్ పేటలోని పోలీస్ స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. మూడు జిల్లాలలో మొత్తం 16 దొంగతనాలు చేసి దాదాపు 100కు పైగా మేకలను దొంగలించిన వారిని అరెస్ట్ చేసి వారి నుండి రూ.4,71,000ల నగదును, 9 మేకలను స్వాధీనం చేసుకొని ఆరుగురిని కోర్టులో హాజరు పర్చినట్టు తెలిపారు. ఈ కేసులో మొత్తం 11 మంది కలిసి చేయడం జరిగిందని అందులో ఆరుగురిని పట్టుకొని కోర్టులో హాజరు పరచడం జరిగిందని మిగిలిన 5 మంది పరారీలో ఉన్నట్టు ఆమె వివరించారు. నిందితులు దొంగలించిన మేకలను అమ్మిన డబ్బులతో ఎవరికి అనుమానం రాకుండా వాటిని అమ్మి సొంతంగా వాహనాలు కొనుక్కోవాలని ఉద్దేశంతో ఉన్న సందర్భంలో పోలీసులు అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. దొంగతనాలకు పాల్పడిన రెండు వాహనాలను కూడా పోలీసులు అదుపులో తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కేసులో గడి పెద్దాపూర్ గ్రామానికి చెందిన అనిల్ కుమార్, ఎరుకల అనిల్, ఎరుకల గోపాల్, ముసలాపూర్ గ్రామానికి చెందిన చిన్న కటికె ఖదీర్ పాషా, ఇప్ప మహేందర్, సంగారెడ్డికి చెందిన మహమ్మద్ షాహిద్ లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్టు వివరించారు. ఈ సమావేశంలో పేట ఎస్సై శంకర్. పోలీస్ సిబ్బందిపాల్గొన్నారు.

పంటలకు ఉతం ఇచ్చే వర్షాలు



జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్

నవతెలంగాణ-కొడిపల్లి

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంటలకు ఉతం ఇచ్చే వర్షాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఆగ్రోస్ కేంద్రాన్ని, భాగ్యలక్ష్మి ట్రేడర్స్‌ను, ఆయన ఆకస్మాత్తుగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించి ధరల పట్టికను రోజువారీగా వేస్తున్నారని షాప్ యజమానులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ వర్షాల వల్ల బోరు బావులు నీటి సామర్థ్యం పెరుగుతుందన్నారు. 2600 కుంటలు ఉన్నాయని కుంటలన్నీ నిండుకుండ లాగా నిండాయని ఆయన తెలిపారు. అన్ని చెరువులు, కుంటలోకి భారీగా నీరు చేరుతుందని తెలిపారు. వచ్చే యాసంగి పంట కూడా మీరు సమృద్ధిగా ఉందని ఆయన తెలిపారు. యూరియా కొరత రాకుండా చూడాలని డీలర్లకు సూచించారు. వర్షాలు కురవడంతో 25 కిలోల యూరియా 25 కిలోల పోటాష్ కలిపి వరికి చల్లాలని ఆయన సూచించారు. జిల్లాలో 2 లక్షల 75 వేల ఎకరాల వరి సాగు, 35 వేల ఎకరాల పత్తి సాగు, 1200 ఎకరాల పెసర్లు సాగు, 2500 ఎకరాల మొక్కలు సాగు, 500 ఎకరాల పైగా కూరగాయల సాగు, చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి 165 ఎకరాల వరి నష్టపోయిందని ఆయన తెలిపారు. అతి త్వరలో రెండు లక్షల పైగా ఉన్న రుణమాఫీ రైతులకు మార్గదర్శకాలు వస్తాయని ఆయన తెలిపారు. రైతులకు ఇంకేమన్నా సమస్యలు ఉంటే వ్యవసాయ అధికారుల సంప్రదించి పలు సూచనలు సలహాలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి ట్రేడర్స్ యజమాని పోల ప్రభాకర్, ఆగ్రోస్ కేంద్రం యజమాని వెంకటేశం గుప్తా, పాల్గొన్నారు

టీఎస్ఆర్జెసిలో కౌన్సిలింగ్ నిర్వహణ



విద్యార్థుల కొట్లాటతో స్పందించిన డీఎస్పీ వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్‌లోని టోల్ ప్లాజా వద్ద ఉన్న గురుకుల పాఠశాలను సందర్శించిన డీఎస్పీ వెంకట్ రెడ్డి మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థుల గొడవలు, కొట్లాటలు పునరావృతం కాకుండా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. తూప్రాన్ టోల్గేట్ వద్ద గల బాలుర గురుకుల పాఠశాలలో 9వ జూనియర్ విద్యార్థులపై 10 వ తరగతి సీనియర్ విద్యార్థులు కొట్టుకున్నారు, దాడి చేసిన విషయంపై తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యార్థుల కొట్లాట మీడియాలో ప్రసారం కాగా డీఎస్పీ వెంకట్ రెడ్డి, సీఐ రంగకృష్ణ, తూప్రాన్ ఎస్ఐ శివానంద్, మనోహర్, సుభాష్ గౌడ్ గురుకుల పాఠశాలకి చేరుకుని విచారణ చేపట్టారు. గొడవకు గల కారణాలు తెలుసుకొని సిబ్బందికి అవగాహన కల్పించారు. ఇటువంటివి భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థులతో సమైక్యంగా వ్యవహరించాలని తెలిపారు. విద్యార్థుల మధ్య ఏ సమస్య ఉన్న మొట్టమొదటగా ఉపాధ్యాయులకు తెలపాలన్నారు. రాత్రిపూట ఉండే ఉపాధ్యాయులు, వాచ్‌మెన్‌లు రాత్రి రెండు గంటల వరకు పర్యవేక్షిస్తుండాలని అందుకు పోలీస్ సహకారం కూడా ఉంటుందని డీఎస్పీ చెప్పారు. చిన్నచిన్న విషయాన్ని పెద్దదిగా చేయడంతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని వారికి ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్‌ను ఉపాధ్యాయులు ఇవ్వాలన్నారు. ప్రిన్సిపల్ మురళి మాట్లాడుతూ గొడవకు ప్రధాన కారకులైన విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామని పాఠశాల నుంచి పంపించి వేయనున్నట్టు తెలిపారు. పాఠశాలలో ఎలాంటి గొడవలు జరగకుండా విద్యార్థులు మంచిగా చదువుకోవాలని, విద్యతోనే వారి భవిష్యత్తు నిర్మాణమై ఉంటుందని, పాఠశాలలో చదువుకునే విద్యార్థులందరూ మంచిగా చదువుకోవాలని డీఎస్పీ వెంకటరెడ్డి విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ రంగకృష్ణ, ఎస్ఐ శివానంద్, పాఠశాల ప్రిన్సిపల్ మురళి,ఉపాధ్యాయులు సురేష్, శ్రీనివాస్, నవీన్, విద్యాశాఖ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-కల్హేర్

కల్హేర్ మండలంలోని కృష్ణాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువత అధ్యక్షులు బైరు పందరి తండ్రి బైరు భూమయ్య ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి మంగళవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి మనో ధైర్యాన్ని అందించారు.

అనంతరం అదే మండలంలోని ఫతేపూర్ గ్రామానికి అంజాగౌడ్ తండ్రి మరణించిన విషయం తెలుసుకొని భౌతికకాయానికి భూపాల్‌రెడ్డి నివాళులర్పించారు. అంజా గౌడ్‌ను వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని అందించారు. ఈ కార్యక్రమాల్లో మండల తాజా మాజీ జెడ్పీటీసీ నరసింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రామ్ సింగ్, తాజా మాజీ ఎంపీటీసీ అంజయ్య సాగర్, గ్రామ పార్టీ అధ్యక్షులు రాములు, నాయకులు రామ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి,శ్రీనివాస్, మొగులయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కెఎస్ ఆర్ కాలనీ అభివృద్ధి కోసం కృషి



కాలనీ నూతన అధ్యక్షుడు మైదం భాస్కర్

కె ఎస్ ఆర్ కాలనీ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ - పటాన్ చెరు

కేఎస్ఆర్ కాలనీ అభివృద్ధి, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్లనున్నట్లు కాలనీ నూతన అధ్యక్షులు మైదం భాస్కర్(ఎల్ఐసి)పేర్కొన్నారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని కె ఎస్ ఆర్ కాలనీ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి సంగారెడ్డి కోర్టు అడ్వకేట్ డాక్టర్ పాండురంగారావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మైదం భాస్కర్ (ఎల్ఐసి) కొనపాల భాస్కర్ ప్యానల్ మధ్య జరిగిన ఎన్నికల్లో మైదం భాస్కర్ ప్యానల్ గెలుపొందింది. అసోసియేషన్ అధ్యక్షులుగా మైదం భాస్కర్ (ఎల్ఐసి), ప్రధాన కార్యదర్శిగా పావంత్స శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఈ మల్లికార్జున్ రావు, సంయుక్త కార్యదర్శిగా రూపక్ బైద్య, కోశాధికారిగా యన్నన్ గండ్ల ఆదిత్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మైదం భాస్కర్ మాట్లాడుతూ కేఎస్ఆర్ కాలనీ వాసులందరినీ కలుపుకొని సమస్యలను పరిష్కరిస్తూ కాలనీ అభివృద్ధే ధ్యేయంగా అసోసియేషన్ నూతన కార్యవర్గం ముందుకు వెళుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

పలువురి జూదరుల అరెస్ట్



తోటపల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో పోలీసుల దాడి

అదుపులోకి 10 మంది జూదరులు

రూ.34.090 వేలు నగదు,9 మొబైల్ ఫోన్ల స్వాధీనం

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని తోటపల్లి గ్రామ శివారు యందు బోయినపల్లి చందర్ రావు వ్యవసాయ క్షేత్రంలో జూదం ఆడుతున్న స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడి చేశారు.10 మంది జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకుని సుమారు రూ.34.090 వేల నగదు,9 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని టాస్క్ ఫోర్స్ అధికారి సీహెచ్.రమేశ్ తెలిపారు.గ్రామాల్లో చట్ట వ్యతిరేక,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు వెనుకాబోమని 8712667445, 8712667446, 8712667447 పిర్యాదు చేయాలని టాస్క్ ఫోర్స్ అధికారులు సూచించారు.స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు అధికారులు తెలిపారు.

కూలిన బ్రిడ్జిని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-చిన్న శంకరంపేట

మండలంలోని టీ మాందాపూర్ గ్రామంలో భారీ వర్షానికి కృంగిన బ్రిడ్జిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు పరిశీలించారు. తాత్కాలికంగా రాకపోకలు సాగించేందుకు అధికారులతో మాట్లాడారు. త్వరలో బ్రిడ్జి మరమ్మతులు చేపట్టనున్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సాన సత్యనారాయణ, రాజిరెడ్డి, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం



నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణంలోని స్థానిక ఎంజి బ్యాంక్ హాల్లో వినాయక చవితి అదేవిధంగా మిలాద్ ఉన్ నబి ఒకేసారి రావడంతో అన్ని మతాల కుల పెద్దలతో స్థానిక సీఐ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈ ఉద్దేశించి డీఎస్పీ సత్యయ్య మాట్లాడుతూ.. పండు గలను ప్రశాంత వాతావరణంలో జరపాలన్నారు. ఎలాంటి మతపరమైన విద్వేషాలకు గురి కాకుండా అన్నిమతాల కుల పెద్దలు, ప్రజాప్రతినిధులు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమ, తాసిల్దార్ సరస్వతి , ఏ డి వీరారెడ్డి, సదాశివపేట సీఐ మహేష్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు సిద్దన్న, మైనార్టీ నాయకులు హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రామ్‌రెడ్డి, బిజెపి నాయకులు చిన్న పటేల్, మున్సిపల్ మున్సిపల్ కౌన్సిలర్లు , తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పేరు చెప్పి బెదిరింపులు


రంగనాథ్ నాకు చాలా క్లోజ్..

నీ నిర్మాణం జోలికి రావొద్దంటే..

రూ.20 లక్షలు ఇవ్వాలంటూ బెదిరింపులు

పోలీసుల రంగ ప్రవేశంతో కటకటాల్లోకి..

నవతెలంగాణ-అమీన్‌పూర్ :



హైడ్రా పేరు చెప్పి బెదిరింపులకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని అమీన్‌పూర్ పోలీసులు అరెస్టు చేశారు. అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో వాడల రాజేంద్రనాథ్ నిర్మాణ రంగంలో ఉన్నారు. అతడి పార్ట్‌నర్ మంజునాథ్ రెడ్డితో కలిసి అమీన్‌పూర్‌లోని ఫ్యూజన్ స్కూల్ వెనుక సాయి విల్లాస్ రోడ్డులో ఓ అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. అయితే ఈ నిర్మాణానికి సంబంధించి హైడ్రా కూల్చివేస్తుందంటూ డాక్టర్ బండ్ల విప్లవ సిన్హా అనే వ్యక్తి బెదిరింపులకు పాల్పడుతున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ నాకు చాలా క్లోజ్ అని, అమీన్‌పూర్‌లో ఏ విషయమైనా రంగనాథ్ నన్నే అడుగుతారంటూ విప్లవ్.. కమిషనర్ రంగనాథ్‌తో కలిసి దిగిన ఫోటోలను రాజేంద్రనాథ్‌కు చూయించి బెదిరిం చారు. నీ నిర్మాణం సేఫ్‌గా ఉండాలంటే.. రూ.20 లక్షలు ఇవ్వాలని, లేకపోతే హైడ్రాకు ఫిర్యాదు చేస్తానని బెదిరించారు. దీంతో రాజేంద్రనాథ్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు అమీన్‌పూర్ ఎస్ఐ టి.విజయరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.